



సోమశిలలో 11.080 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 23: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి ప్రాజెక్టులో 11.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



రంజాన్ వేళలు ఇఫ్తార్ (ఆదివారం) : 6.22 | సహరి (సోమవారం) : 4.52

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 35.2 25.5 | కావలి : 35.0 25.0 | కందుకూరు : 34.0 26.0 | ఆత్మకూరు : 38.0 25.0 | ఉదయగిరి : 34.0 22.0



ఆట మొదలైంది!

- జిల్లావాసులకు డబుల్ ధమాకా!
- ఒకటి ఐపీఎల్.. ఇంకొకటి పొలిటికల్
- జట్ల గెలుపుపై అభిమానుల్లో ఉత్కంఠ

నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండు వేసవిలో రాజకీయ, క్రీడాభిమానులకు ఉత్కంఠ రేపే సీజన్ ఆరంభమైంది. కుర్రకారును ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టీ-20 క్రికెట్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. సాధారణ పరిస్థితుల్లో అయితే చిన్నపెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారిలో ఉత్కంఠ రేపేది. అయితే, ఇప్పుడు అంతకు మించిన పొలిటికల్ ఫీవర్ వచ్చేసింది. ఎన్నికల బరిలో నిలిచే రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు శుక్రవారం నాటితో ఖరారయ్యారు. దీంతో పొలిటికల్ హీట్ పెరిగింది. ఐపీఎల్‌కు పొలిటికల్ ఫీవర్‌కు చాలా తేడా ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌లు దేశంలోని ప్రధాన నగరాల్లోని మైదానాల్లోనే జరుగుతాయి. కానీ పొలిటికల్ మ్యాచ్ జిల్లాలోని సందుగొందుల్లోనూ జరుగుతుంది. ఐపీఎల్ మ్యాచ్ రోజులో ఒక నిర్దిష్ట సమయంలోనే జరుగుతుంది. అది కూడా మూడు గంటల సేపే. శని, ఆదివారాల్లో మాత్రం రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. మిగిలిన రోజుల్లో సాయంత్రం 4 గంటలకు మాత్రమే మ్యాచ్ జరుగుతుంది. పరిమిత ఓవర్లు.. నిర్ణీత కాలం.. ఇది ఐపీఎల్ ఆట సమయం. ఈ మూడు గంటలు మాత్రమే క్రీడాభిమానుల్లో ఉత్కంఠ ఉంటుంది. కానీ పొలిటికల్ గేమ్ అలా కాదు. పగలు రేయి అన్న తేడా లేదు. 24 గంటలూ సాగుతూనే ఉంటుంది. నిమిషానికో విశేషం, గంటకో సంఘటనతో ఉత్కంఠ రేపుతూనే ఉంటుంది. ఐపీఎల్ మ్యాచ్ క్రీడాకారులకు ఆదాయం వస్తుంది. కానీ ఎన్నికల బరిలో తలపడుతున్న రాజకీయ క్రీడాకారులకు చేతి చిలుము వదులుతుంది. అయితే రాజకీయ క్రీడాకారులను ఎంకరేజ్ చేసే ప్రేక్షకులకు మాత్రం ఎంతో కొంత గిట్టుబాటు అవుతుంది. ఇక ఎక్కడో జరిగే ఐపీఎల్ జట్ల గురించి అందులోని ఆటగాళ్ల గురించి, వారి ఆట తీరు గురించి ఏడాదిలో ఎన్నోసార్లు ప్రజలు చూసే ఉంటారు. అయితే ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల జట్ల క్రీడాకారులు, వారి ఆటతీరులో ఎప్పటికప్పుడు మార్పులు ఉండనే ఉంటాయి. ఈ క్రమంలో జరగనున్న ఎన్నికల సంగ్రామానికి ప్రధాన రాజకీయ పార్టీలు తమ పార్టీల జట్టు సభ్యులను ప్రకటించాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా బరిలోకి దిగుతుండగా, అధికార వైసీపీ ఒంటరి పోరుకు సిద్ధమైంది.

ఉమ్మడిగా..

సార్వత్రిక ఎన్నికల మ్యాచ్‌లో టీడీపీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బలమైన జట్టును రంగంలోకి దించింది. ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 9 మంది క్రీడాకారుల్లో ఆరుగురిని కొత్తగా రంగంలోకి దించింది. ఈసారి జట్టు సభ్యులు అలసిపోకుండా, రాజకీయ అభిమానులు నిరుత్సాహపడకుండా అన్ని విధాలా అండగా ఉండే ఇద్దరు బలమైన అభ్యర్థులను బరిలోకి దించింది. అపార అనుభవజ్ఞులతో పాటు యువరక్తానికి అవకాశం ఇచ్చింది. మహిళలకు సముచిత స్థానం కల్పించింది. జట్టు సారథిగా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్ని నియోజకవర్గాలను కలియతిరుగుతూ జట్టు సభ్యులను సమన్వయం చేసుకొంటూ ముందుకు కదులుతున్నారు. టీడీపీ జట్టుపై ప్రేక్షకుల అంచనాలు ఇలా ఉన్నాయి. టీం మేనేజర్, స్ట్రైకింగ్ బ్యాట్స్‌మన్‌గా పొంగూరు నారాయణ స్కోరు మీద ప్రజల అంచనాలు బలంగా ఉన్నాయి. ఓపెనర్‌గా క్రీజులోకి అడుగుపెడుతున్న మరో బ్యాట్స్‌మన్ నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. నారాయణ, శ్రీధర్‌రెడ్డి ఈ ఇద్దరు ఓపెనర్లు ప్రత్యర్థి జట్టు తమ ముందు ఉంచిన టార్గెట్‌ను చిత్తు చేస్తారని, రికార్డు స్కోరు సృష్టిస్తారనే పొలిటికల్ అభిమానులు అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ ఫలితాలను మలుపుతిప్పగలిగే సత్తాకలిగిన కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, జట్టు విపత్కర పరిస్థితులను ఫేస్ చేస్తే దానిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మిడిల్ ఆర్డర్‌లో ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి వంటి అనుభవజ్ఞుడు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల నుంచి యువకులు.. హిట్టర్స్ కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావులను సిద్ధం చేసింది. ఇక తిరుపతి పార్లమెంట్ ఫలితాలపై ప్రభావం చూపగలిగే స్థాయి కలిగిన సీనియర్ క్రీడాకారుడు, రాజకీయ క్రీడలో ఆల్ రౌండర్‌గా పిలవబడే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి బరి నుంచి రంగంలోకి దింపింది.

వైసీపీ టీం

గత ఎన్నికల్లో ట్రోఫీ గెలుచుకున్న వైసీపీ టీం ఈసారి ఆట మొదలు కాకముందే ఆటుపోట్లను ఎదుర్కొందనే విషయంలో అనుమానం లేదు. జట్టు మేనేజర్ పోకడ నచ్చక ముగ్గురు సీనియర్ ఆటగాళ్లు మ్యాచ్‌కి ఇంకా ఏడాది సమయం ఉండగానే పక్కకు వచ్చేసి ప్రత్యర్థి టీంలో చేరిపోయారు. టీంలోని ఒక ఆటగాడి కుట్రలు జీర్ణించుకోలేక, వాటిని సమర్థించిన మేనేజర్ పోకడను భరించలేక అందరి నోట మెప్పులు పొందిన ఒక బలమైన క్రీడాకారుడు జట్టు నుంచి తప్పుకున్నాడు. ప్రత్యర్థి టీంలో సారథి బాధ్యతలు స్వీకరించాడు. దీంతో చేదు అనుభవాలతో వైసీపీ ఆట మొదలు పెట్టాల్సి వచ్చింది. కానీ వైసీపీ టీంలో కూడా బలమైన క్రీడాకారులు ఉన్నారు. జట్టు సారథి బాధ్యతలు చేపట్టిన నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఐపీఎల్ (ప్రత్యక్ష ఎన్నికల్లో) బ్యాట్ పట్టుకోవడం తొలిసారే అయినా ప్రత్యర్థుల లెక్కలు తారుమారు చేయడంలో సిద్ధహస్తుడిగా గుర్తింపు పొందారు. ఇక ఈ జట్టులో ఇప్పటికే రెండు, మూడు సార్లు ఎన్నికల క్రీడలో ఆడిన అనుభవం కలిగిన క్రీడాకారులు ఉన్నారు. నెల్లూరు రూరల్ నుంచి ఆల్ రౌండర్‌గా గుర్తింపు పొందిన ఆదాల ప్రభాకరరెడ్డి పోటీ చేస్తున్నారు. ఈయన ఆట తీరు గురించి జిల్లా ప్రజలకు బాగా తెలుసు. అయితే ఈ సారి ఎలా ఉండబోతోంది అనే విషయంలోనే ఉత్కంఠ నెలకొని ఉంది. ఇక కావలి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఫామ్‌లో లేరనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. అయితే ఈయన్ను తక్కువగా అంచనా వేయలేము. ఈయనకు రెండు సార్లు గెలిచిన అనుభవం ఉంది. కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబం రాజకీయ క్రీడల్లో ఆరితేరింది. ఆత్మకూరు, ఉదయగిరిల నుంచి మేకపాటి కుటుంబ వారసులు విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలు రంగంలో ఉన్నారు. ఈ కుటుంబానికి అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. కందుకూరు నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆ నియోజకవర్గ పిచ్‌కి కొత్త వారే కానీ ఆటలో మాత్రం పాతవారే. ఇక తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి వచ్చే సర్వేపల్లి నుంచి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రంగంలోకి దిగారు. చతురత కలిగిన క్రీడాకారుడిగా ఈయనకు మంచి గుర్తింపు ఉంది.



పైసా లేదు.. వసతులెలా!?

- పోలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యత హెచ్‌ఎంలదే!
- నాడు-నేడు నిధులు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ
- ఉన్నతాధికారుల ఒత్తిళ్లు
- తలలు పట్టుకుంటున్న ప్రధానోపాధ్యాయులు

ప్రభుత్వ తీరు చాలా విడ్డూరంగా ఉంది. బడి ఖాతాల్లో నిధుల్లేక నాడు-నేడు పనులు చాలాచోట్ల అర్ధంతరంగా ఆగిపోయి మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. చిన్న అవసరాలకు కూడా పైసా లేక ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల్లో నిర్వహణకు కావలసిన ఏర్పాట్లకు నాడు-నేడు నిధులు వినియోగించుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై హెచ్‌ఎంలు మండిపడుతున్నారు.

సంగం, మార్చి 23 : జిల్లాలో 2,033 ప్రాథమిక, 2,56 ప్రాథమికోన్నత, 2,95 ఉన్నత పాఠశాలలతోపాటు మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 90శాతం పాఠశాలల్లో 2,317 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో బీఎల్వోలతోపాటు ఏరియా సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఆయా కేంద్రాలలో వీరు పర్యటించి పోలింగ్ నిర్వహణకు కావలసిన ర్యాంపుల నిర్మాణం, విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు వంటి వసతులు ఉన్నాయా.. లేకుంటే ఏమేమి వసతులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు నివేదికలు పంపారు. దాదాపు పోలింగ్ కేంద్రాలన్నీ పాఠశాలల్లోనే ఉన్నాయి. ఏ కేంద్రంలో వసతులు ఏవో వాటి ఏర్పాట్ల బాధ్యతలు కూడా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులదే చూసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు మనబడి.. నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 స్కూళ్లకు విడుదల చేసిన స్కూల్ మెయింటెన్స్ ఫండ్ (ఎస్‌ఎంఎఫ్) నుంచి నిధులు వాడుకోవాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు కూడా రాని స్కూళ్ల హెచ్‌ఎంలు అందుబాటులో ఉన్న ఇతర నిధులను ఖర్చు చేయాలని కూడా చెప్పారు. దీనిపై హెచ్‌ఎంలు భగ్గుమంటున్నారు. అసలు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ల కింద పైసా ఇవ్వలేదు. నాడు-నేడు 2వ విడత పనులు చేస్తున్న స్కూళ్లకు ఇచ్చిన నిధులు ఖర్చయిపోయాయి. కొన్నిచోట్ల నిధులు చాలక అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. అలాంటప్పుడు ఖాతాల్లో నిధులు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. నిధులు లేవని చెప్పినా ఎలాగైనా చేయాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.



సంగం పాఠశాలలో నిలిచిపోయిన అదనపు భవనాల నిర్మాణం

స్కూల్ గ్రాంటు సగం ఇతర జిల్లాల పాఠశాలలకు..

ఇటీవల ప్రతి పాఠశాలకు రూ.26వేల స్కూల్ గ్రాంటును పాఠశాలల ఖాతాలకు జమ చేసింది. దీనిలో సగం ఇతర జిల్లాలలోని పాఠశాలల అడ్రస్సులతో జమ చేయాలని చెప్పడంతో పంపించారు. పాఠశాలల నిర్వహణకు అవసరమైతే నాడు-నేడు నిధుల నుంచి కేటాయించుకోమని ప్రభుత్వం సూచిస్తుంది. అసలు ఏ పాఠశాలలోనూ నాడు-నేడు నిధులు మిగల్లేదు. అవి చాలకే చాలా పాఠశాలల్లో నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. చాలా మంది హెచ్‌ఎంలు చివరి దశలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు సొంత డబ్బు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ బిల్లులు రాకపోతే తాము నష్టపోయినట్లేనని ఆవేదన చెందుతున్నారు.

రెవెన్యూశాఖ వ్యవహారం

గతంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన అంశం పూర్తిగా రెవెన్యూ శాఖ చూసుకునేది. ఆ శాఖ ఆధ్వర్యంలోనే ప్రతి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తారు. రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేసేవారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రెయిలింగ్, ర్యాంపులు, ఏర్పాటు చేసేవారు. అంతేకాదు వేసవి కావడంతో ఫ్యాన్లు, వెలుతురు కోసం లైట్లు, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈసారి అందుకు భిన్నంగా విద్యాశాఖను ఏర్పాటు చేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఆదేశాలతో హెచ్‌ఎంలపై భారం మోపడం ఎంతవరకు సమంజసమని విద్యాశాఖ అధికారుల్లో చర్చ నడుస్తోంది.

పసుపు సైన్యం ఏకమై పార్టీని గెలిపించాలి!

- టీడీపీ శ్రేణులకు నారా భువనేశ్వరి పిలుపు
- మృతుల కుటుంబాలకు పరామర్శ



కురిచెర్లపాడులో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

వెంకటాచలం, మార్చి 23 : 'టీడీపీని నిర్మించింది ఎన్టీ రామారావు. ఇప్పుడా పార్టీని నడిపిస్తున్నది నారా చంద్రబాబు. పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సింది నారా లోకేష్ ఒక్కడే కాదు.. పసుపు సైన్యం అంతా ఏకమై పార్టీని ముందుకు తీసుకెళ్లి గెలిపించుకోవాలి. ఎవరైనా అడ్డువస్తే సైకిల్‌తో ఢీకొని ముందుకెళ్లాలి.' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం వెంకటాచలం మండలంలో ఆమె పర్యటించి చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. తొలుత పుంజులూరు పాడులో ఆర్ని నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య అరుణమ్మను పరామర్శించారు. ఆ తర్వాత కురిచెర్లపాడుకు చేరుకుని బొల్లా సుబ్బానాయుడు చిత్రపటానికి నివాళ్లర్పించి, సీతారావమ్మను పరామర్శించారు. ఈ రెండు కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి, 42 రోజుల పాటు జైలు ఉంచారని, ఆ సమయంలో 208 మంది కార్యకర్తలు మనస్తాపానికి గురై చనిపోయారని అన్నారు. బాధిత కుటుంబాలను తాను ఓదార్చి అండగా నిలుస్తున్నానన్నారు. ఇటీవల ఆత్మకూరు చంద్రయ్య అనే టీడీపీ కార్యకర్తను తన్ని జై జగన్ అని చెప్పమన్నా ఆయన మాత్రం జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని చెప్పడంతో అతి కిరాతకంగా చంపేశారని ఆవేదన చెందారు. ఇలాంటి దుర్మార్గపు రాక్షస పాలనలో ప్రజలు ఉన్నారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ఆమె వెంట సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ తదితరులు ఉన్నారు.

రాజకీయ సేవలో ప్రభుత్వ ఉద్యోగి



రాజమోహన్‌రెడ్డి వెంట ఉండి సలహాలు ఇస్తూ సమస్యలను నోట్ చేసుకుంటున్న ఫారుక్ అలీ

మర్రిపాడు, మార్చి 23: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి నిన్నటి వరకు వ్యక్తిగత సహాయకుడిగా ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి అయిన ఫారుక్ అలీ ఎన్నికల కోడ్‌ను లెక్క చేయకుండా నేటికీ నిత్యం మేకపాటి వారిని స్మరిస్తూ.. వారికి రాజకీయ సేవ చేయటంలో మునిగిపోయాడు. ఈయన గారి పని ఉదయగిరి మండలం కృష్ణంపల్లిలోని హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా పని చేయాల్సి ఉంది. గత కొంతకాలం కిందట ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి వ్యక్తిగత సహాయకునిగా జాయిన్ అయ్యారు. ప్రస్తుతం విక్రమ్‌రెడ్డి తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి మూడు రోజుల నుంచి రచ్చబండ పేరుతో మండలంలోని రోజుకొక్క గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో నేతలను సమన్వయం చేస్తూ అందరిని రచ్చబండ వద్దకు పిలిచి ఒకరి మీద ఒకరికి ఉన్న మనస్పర్థలను పక్కన పెట్టి మమ్మల్ని గుర్తించాలని, రాబోయో ఎన్నికల్లో విక్రమ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. అయితే శనివారం సాయంత్రం మండలంలోని కృష్ణా పురంలో జగిన రచ్చబండ కార్యక్రమంలో అన్నీ తానై ఫారుక్ అలీ కార్యక్రమ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రాజమోహన్‌రెడ్డి వెంట తిరుగు తున్నారు.

ఎన్నికల ప్రచారంలో రేషన్ డీలర్

కలువాయి, మార్చి 23: మండలంలోని కేశమనేనిపల్లిలో శనివారం అధికార పార్టీ నాయకుల ఎన్నికల ప్రచారంలో గ్రామానికి చెందిన రేషన్ డీలర్ పామూరు రమేష్ పాల్గొన్నారు. వైసీపీ నాయకులతో కలసి గ్రామంలో ర్యాలీగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. డీలర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని తన వీరాభిమానాన్ని చాటుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

రూ.5లక్షల నగదు స్వాధీనం



తహసీల్దార్ కార్యాలయంలో నగదును అప్పగించిన పోలీస్‌లు

సైదాపురం,మార్చి23: స్థానిక కైవల్యానది సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు శనివారం పోలీసులు చేప ట్టిన తనిఖీల్లో రూ.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. కోడ్ అమలులో భాగంగా వాహనాలు తనిఖీ చేసే సమయంలో గూడూరు నుంచి సైదా పురం వస్తున్న కారులో కాటంరెడ్డి మహేంధర్ రెడ్డి వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా రూ.5లక్షల నగదును తరలిస్తు న్నట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుడి ఇంటిపై దాడి

- క్రికెట్ వద్ద జరిగిన గొడవతో..
- 11మందిపైన అట్రాసిటీ కేసు నమోదు



దాడిలో గాయపడిన కార్తీక్

మర్రిపాడు, మార్చి 23: క్రికెట్ ఆట వద్ద జరిగిన చిన్నపాటి గొడవలో కార్తీక్ అనే దళితుడి ఇంటిపై అగ్రవర్ణాల వారు దాడికి తెగబడిన ఘటన శుక్రవారం రాత్రి తిక్కవరంలో చోటు చేసుకుంది. గ్రామ యువకులు బుధవారం సరదాగా క్రికెట్ ఆడుతుండగా సిక్స్ బౌండరీ వద్ద మాటామాట పెరిగి చిన్న గొడవ జరిగింది. అక్కడ కార్తీక్ అనే యువకుడు సాయిపై చేయి చేసుకున్నాడని తెలుసుకున్న సాయి తల్లిదండ్రులు కార్తీక్ వాళ్ల ఇంటివద్దకు వెళ్లారు. తమ కొడుకుతో ఎందుకు గొడవ పడ్డావు అని ప్రశ్నించారు. అందుకు కార్తీక్ దురుసుగానే సమాధానం చెప్పాడు. అందుకు సాయి కుటుంబీకులు కడప జిల్లా బద్వేలు ప్రాంతం నుంచి కొందరు యువకులను పిలిపించి, కార్తీక్ ఇంటిపై కర్రలతో దాడి చేసి అడ్డు వచ్చిన వారిని విచక్షణారహితంగా కొట్టారు. అనంతరం అక్కడ నుంచి పారిపోయారు. ఈ దాడిలో కార్తీక్‌తో పాటు కుటుంబీకుల్లో ఇద్దరి తలలకు బలమైన రక్తపు గాయాలు, మరో నలుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ వేణు, మర్రిపాడు ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. కార్తీక్ ఇంటిపై దాడి చేసిన 11మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

సంగం, మార్చి 23: వడ్డెరపాలెంకు చెందిన యామాల మాల్యాద్రి (40) శనివారం గడ్డి మందు తాగి మృతి చెందాడు. దినసరి కూలీ పనులు చేసుకుని జీవించే ఈయనకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఏమి జరిగిందో ఏమోగానీ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు సేవించాడు. కుటుంబసభ్యులు గమనించే సమయానికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు మార్చ్యురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు దారుణ హత్య

- దుర్గంధంతో పోలీసులకు సమాచారం
- రక్తపు మడుగులో మృతదేహం
- ఆలస్యంగా వెలుగులోకి..



లీలావతి(ఫైల్)

నెల్లూరు(క్రైం), మార్చి 23: కారణం ఏమైనా కావచ్చుకాని ఒంటరిగా నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలు దారుణహత్యకు గురైన ఘటన నగరంలోని అరవింద నగర్‌లో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. అరవిందనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటిని గతేడాది డిసెంబర్‌లో లీలావతి (60) అద్దెకు తీసుకుంది. తన కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడని చుట్టుపక్కల వారికి చెబుతూ ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమె స్థానికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ అందరితో కలిసి ఉండేది. కాగా శనివారం లీలావతి నివాసం ఉంటున్న ఇంటి తలుపులకు బయట తాళం వేసి ఉండగా లోపల నుంచి దుర్గంధం వస్తుండాన్ని స్థానికులు గుర్తించి చిన్నబజారు పోలీసులకు సమా చారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ బీ.అశోక్‌కుమార్, ఎస్‌ఐ సైదులు స్థానికుల సహకారంతో ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా లీలావతి రక్తపు మడుగులో మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పరిశీలించగా తలకు బలమైన గాయం ఉంది. సంఘటనా స్థలంలో మృతురాలికి చెందిన ఆధార్ కార్డు లభించింది. ఆ కార్డులో లీలావతి వైఫ్ ఆఫ్ బాస్కర్‌రెడ్డి, నియర్ సత్యం షాపీ, ట్రంకురోడ్డు అని అడ్రస్ ఉంది. పోలీసులు ఆ అడ్రస్ వద్దకు వెళ్లి విచారించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో పోలీసులు హత్య జరిగిన ప్రాంతంలో స్థానికులను విచారించగా వృద్ధురాలిని మంగళవారం చివరిసారిగా చూశామని, అప్పటి నుంచి ఆమె కన్పించలేదని తెలిపారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలిని హత్య చేసి ఇంటి బయట తాళాలు వేసుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. ఇది జరిగి నాలుగు రోజులై ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలు హత్యపై అనేక కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలుసుకునేం దుకు ప్రయత్నిస్తున్నారు. సంఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తు న్నారు. కుటుంబ వివరాలు తెలిసిన వారు 9440796305, 8074186436 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	125
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6326
వెండి కిలో ధర	రూ. 77,400
వెండి ఒక గ్రాము	రూ. 79.40

అదుపుతప్పి లారీ బోల్తా

మర్రిపాడు, మార్చి 23: కడప నుంచి నెల్లూరు వైపు కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీ శనివారం మర్రిపాడుకు కిలో మీటర్ దూరంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. చుట్టుపక్కల ప్రజలు, దారిన వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. పోలీసులు, రోడ్డు నిర్వహణ వారు వచ్చి వ్యర్థాలను క్లీన్ చేపించి వాహనాన్ని అక్కడ నుండి బయటకు తీశారు.

'క్షయ' నియంత్రణ ఏది..?

- డబ్ల్యూహెచ్‌వో నిబంధనలకు తూట్లు
- జిల్లాలో 13 వేల మందికి పైగా రోగులు
- నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం


నెల్లూరు(వైద్యం), మార్చి 23 : జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణ గాలిలో దీపంలా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు సైతం తూట్లు పడుతోన్నాయి. అయితే 2020వ సంవత్సరం నాటికి ప్రతి లక్ష మందిలో 174 మంది ఈ వ్యాధికి గురైనా కరోనా కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంత వరకు నియంత్రణలోకి వచ్చింది. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోయాయి. దేశంలో ప్రతి లక్ష మందిలో 240 మంది ఈ వ్యాధికి గురవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. అయితే జిల్లాలో మాత్రం ఈ లెక్కలు తారుమారు అవుతోన్నాయి. లక్ష మందిలో 500 మందికి పైగా క్షయవ్యాధికి గురవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ చెప్పే లెక్కలకు వాస్తవంగా నమోదవుతున్న బాధితుల సంఖ్యకు చాలా తేడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి కేవలం 1903 మంది క్షయకు చికిత్స పొందుతున్నారని, 13 మంది మృతి చెందారని వైద్య ఆరోగ్యశాఖ చెబుతుండగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో 13వేల మందికి పైగా చికిత్స పొందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఏటా 100 మంది వరకు మృత్యువాత పడుతున్నట్లు సమాచారం. గతంలో ఈ వ్యాధివస్తే ప్రాణాపాయం తప్పదన్న ఆందోళన ఉండేది. ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఎంతో విలువైన మందులు కూడా అందజేస్తోంది. అయితే వ్యాధి గ్రస్తుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యాధిగ్రస్తుల నుంచి ఆరోగ్యవంతునికి గాలి ద్వారా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉండడంతో గతంలో వ్యాధిగ్రస్తుల పట్ల ప్రజల్లో వివక్ష ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి తగ్గింది. ఈ నేపథ్యంలో మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం జరుపుకోవాలని డబ్ల్యూహెచ్‌వో తీర్మానించింది.

ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుంది



క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుంది. జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధిని నిర్ధారించేందుకు ప్రత్యేక గళ్ల పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. నెల్లూరు, ఆత్మకూరు, రాపూరు, ఉదయగిరి, బుచ్చి, కావలి, కోవూరు, తదితర ప్రాంతాలలో 13 టీబీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక సీబీనాట్ పరికరం అందుబాటులో ఉంది. ఈ ఏడాది 9090 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి 756 మంది వ్యాధి గ్రస్తులను గుర్తించాం.

- డాక్టర్ ఖాదర్‌వలి,
జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి



సంవత్సరం	నిర్ధారణ	మరణించినవారు
2019	5245	64
2020	4958	62
2021	5597	56
2022	3804	25
2023	3898	20
2024	1903	13 (ఫిబ్రవరి వరకు)

అందుబాటులో నిర్ధారణ పరీక్షలు

క్షయ వ్యాధిని గుర్తించేందుకు జిల్లాలో 37 గళ్ల పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. వ్యాధి తీవ్రత ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్) గుర్తించేందుకు డామియల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆధునాతన పరీక్ష కేంద్రం ఉంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వ్యాధి స్థాయిని త్వరగా నిర్ధారించే అత్యాధునిక సీబీనాట్ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రతినెల జిల్లా వ్యాప్తంగా 500కుపైగా గళ్ల పరీక్షలను చేసి క్షయ వ్యాధి స్థాయిని నిర్ధారిస్తున్నారు. అందుకు తగ్గ వైద్యం అం దుబాటులో ఉంది. క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నివారించే వీలుంది. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులలో 60 శాతం మంది క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. వ్యాధి లక్షణాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

ఈ నెల 24వ తేదీన ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి గుప్తాపార్క్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, క్షయ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ఎమ్మెల్యే ప్రసన్న చర్యలు సిగ్గుచేటు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 23: ప్రసార మాధ్యమాల సాక్షిగా నియోజకవర్గ ప్రజలు విస్తుపోయేలా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి అవినీతి, బీసీ నాయ కత్వం పట్ల తాను సాగించిన హింసను వెల్లడించడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మండి పడ్డారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విడవలూరు మండలం ఊటుకూరు పంచాయతీ సర్పంచి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తుపాకుల వెంకటరమణమ్మ గెలిచినా అధికారం అడ్డం పెట్టుకుని ఓడిన వైసీపీ అభ్యర్థి సవుటూరి వెంకటశేషమ్మ గెలిచినట్లు ప్రకటించారన్నారు. ఎమ్మెల్యే ప్రసన్న ప్రజల, ప్రభుత్వ ధనాన్ని తన అనుచరులు దోచుకునేలా సహకరించా రన్నారు. తన అనుచరులు ఎంత సంపాదించారో తన వద్ద లెక్కలు ఉన్నాయని చెప్పడం ఆయన చేసిన అవినీతి, అక్రమ సంపాదనకు నిలువుటద్దంగా నిలుస్తున్నాయన్నారు. విడవలూరు మండల బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ పేదల కడుపు కొడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్యకాండ, ఇసుక మాఫియా ఎమ్మెల్యే ప్రసన్న తన నోటితో బహిర్గతం చేశారన్నారు. బీసీల పట్ల అవలంబించిన దుర్మార్గపు చర్యలను కప్పిపుచ్చుకొనేందుకు ఇప్పుడు అదే ప్రాంతానికి వెళ్లి పొరపాటు జరిగిందని మొసలి కన్నీరు పెడుతున్నారన్నారు. మీరు అన్యాయంగా పెట్టించిన తప్పుడు కేసులను ఉపసంహరించుకుని, చేసిన తప్పుడు పనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇండ్ల రాఘవేంద్ర, గడ్డం విజయకుమార్, యశ్వంత్‌సింగ్, దాసరి ప్రసాద్, చిలకా ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ



స్వామి,అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

డక్కిలి (రాపూరు), మార్చి 23: స్థానిక పెంచల కోనలో శనివారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపారు. సాయంత్రం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహ స్వామికి వేద పండితుల మంత్రోచ్ఛర నలు, మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల నడుమ పల్లకీసేవ, ఉంజలసేవను వైభవోపేతంగా చేపట్టారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో సాగర్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

స్వాతంత్ర్య సమరయోధుడు కేవీ చలమయ్య అస్తమయం



కేవీ చలమయ్య(ఫైల్)

నెల్లూరు(సాంస్కృతికం) మార్చి 23 : అమరజీవి పొట్టిశ్రీరాములు సహచరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కేవీ చలమయ్య శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కాంగ్రెస్‌వాదిగా, వ్యాపార వేత్తగా, వివిధ ఆర్యవైశ్య సంస్థలలో వివిధ హోదాలలో పనిచేసిన ఆయన తమిళనాడు మాజీ గవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఆత్మబంధువు. రోశయ్య నెల్లూరుకు వస్తే కేవీ చలమయ్య ఇంట్లో ఆతిథ్యం స్వీకరించనిదే వెళ్లేవారు కాదు. శ్రీసర్వోదయ కళాశాల వ్యవస్థాపక కమిటీ సభ్యుడిగా, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ చెన్నై రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన పార్థివదేహాన్ని డీసీసీ అధ్యక్షుడు సీహెచ్ దేవకుమార్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు రంగయ్యనాయుడు, ఆటోమొబైల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టే రామమూర్తి, హోటల్ మురళీకృష్ణ అధినేత గ్రోసు సుబ్బారావు, హజరత్ బాబు, ప్రభుత్వం తరఫున ఆర్డీవో మాలోలా, శ్రీసర్వోదయ కళాశాల కరస్పాండెంట్ హేమచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ సందర్శించి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చలమయ్య మృతికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో సంతాప తెలిపారు. చిత్తశుద్ధి కలిగిన దేశభక్తుడని కొనియాడారు. ఆయన నిబద్ధత, అంకితభావం, దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతి ప్రకటించారు.

ఉదయగిరి టికెట్ కోసం రూ.30 కోట్లు అడిగారు!


- విజయసాయిపై మాజీ ఎమ్మెల్యే వంటేరు ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు

జలదంకి, మార్చి 23 : వైసీపీ తరఫున ఉదయగిరి అసెంబ్లీ టికెట్ అడిగేందుకు విజయసాయిరెడ్డి వద్దకు వెళితే రూ.30కోట్లు ఇవ్వాలని తనను డిమాండ్ చేసినట్లు టీడీపీ నేత, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో శనివారం వంటేరు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి తాను రూ.7కోట్లు తీసుకుని టీడీపీలో చేరానని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ తన 30ఏళ్ళ రాజకీయ ప్రయాణంలో ఒక్క పైసా అవినీతికి పాల్పడ్డానని నిరూపించగలవా!? అంటూ సవాల్ విసిరారు. తాను అవినీతికి పాల్పడలేదని కాణిపాకం వినాయకుడి సన్నిధిలో ప్రమాణం చేస్తానని, అదే విజయసాయి ఎక్కడా అవినీతికి పాల్పడలేదని జగన్‌పై ప్రమాణం చేస్తే చాలని అన్నారు. పదేళ్ల క్రితం తాను వైసీపీలో చేరినప్పుడు ఎంత డబ్బు ఇచ్చారని అన్నారు. తనకు తానే టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఇకనైనా విజయసాయి అవాస్తవ ఆరోపణలు మాని, రాజకీయం చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్ సుదాకర్, టీడీపీ నాయకులు మదురెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.





తెప్పోత్సవంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారు

పుష్కరిణిలో ఊరేగుతున్న శ్రీనివాసుడు

కనుల పండువగా తెప్పోత్సవం

- గజవాహనంపై శ్రీవారి గ్రామోత్సవం
- భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- నేడు ప్రసన్నుడి కల్యాణం

బిట్రగుంట, మార్చి 23: బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు కాయాకర్పూర హారతులను అందచేశారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, సహస్రనామార్చన, నివేదన కార్యక్రమాలను అర్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యుల బృందం నిర్వహించారు. కోనేటి రాయుడికి మొక్కులు తీర్చుకొనేందుకు భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో తరలివచ్చారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడు తెప్పోత్సవానికి ఆలయ ఉత్తర ముఖద్వారం ద్వారా తరలివచ్చారు. గోవిందా.. గోవిందా .. అంటూ భక్తుల నామస్మరణ, బాణసంచా పేలుళ్ళ, విద్యుత్ దీపాలంకరణ మధ్య కనుల పండువగా తెప్పపై స్వామివారు ఊరేగుతుండగా తిలకించేందుకు వేలాదిగా భక్తులు వచ్చారు. తెప్పోత్సవానికి ఉభయకర్తలుగా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, శివప్రియ, పీటీ జన్నార్థన్‌లు వ్యవహరించారు. ఉభయకర్తలకు ఈవో రాధాకృష్ణ, చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



అడుగడుగునా అన్నసంతర్పణ

బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తుల ఆకలి తీర్చేందుకు పలుచోట్ల అన్నసంతర్పణ చేశారు. కావలికి చెందిన జనిగర్ల మహేంద్రయాదవ్, గరుడసేవ శంభునిసత్రం, బ్రాహ్మణ నాంచారమ్మసత్రం ఆధ్వర్యంలో శేషసాయి మందిరంలో అన్నసంతర్పణ చేశారు. విశ్వనాథరావుపేట, తాళ్ళూరు పంచాయితీల మధ్య అటవీ ప్రాంతంలోని శ్రీవారి నిజ పాదాలకు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం బిలకూటక్షేత్రంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణానికి శ్రీవారి నిజపాదాల వద్ద నుంచి తలంబ్రాలను తరలించనున్నారు.

నేడు కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవిభూదేవి సమేత శ్రీనివాసుడికి ఆదివారం కల్యాణం నిర్వహించనున్నారు. పచ్చని మామిడి తోరణాలు, చలువ పందిళ్ల మధ్య స్వామివారి కల్యాణ వేదికను అందంగా అలంకరించారు.

'పది' పరీక్షకు 1,802 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 23 : జిల్లాలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 1,802 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 31,348 మంది హాజరు కావాల్సి ఉండగా 29,546 మంది హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 29,124 మందికి 28,261 మంది హాజరు కాగా 863 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 2,224 మందికి 1,285 మంది హాజరు కాగా 939 మంది గైర్హాజరయ్యారు. విద్యాశాఖ జేడీ, జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం ఆరు పరీక్ష కేంద్రాల్లో, డీఈవో పీజేవీ రామారావు 5 కేంద్రాల్లో, ఫ్లైయింగ్ స్క్వాడ్ 49 సెంటర్‌లలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

నేడు కెమిస్ట్రీ, హిస్టరీ మూల్యాంకనం ప్రారంభం

ఇంటర్ కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టుల మూల్యాంకనాన్ని ఆది వారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. గతంలో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26న ప్రారంభం కావాల్సిన ఈ సబ్జెక్టులను 24వ తేదీ నుంచే ప్రారంభిస్తు న్నామన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంబంధిత లెక్చరర్స్‌కు సమాచారం అందించాలన్నారు. అధ్యాపకులు 24వ తేదీ ఉదయం 10 గంట లకు స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళా శాలలో జరిగే స్పాట్ క్యాంప్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు.

అనుమతి లేని సమావేశాలొద్దు



మద్యం దుకాణం పరిశీలిస్తున్న ఆర్వో మధులత

ఆత్మకూరు, మార్చి 23: ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున కల్యాణమండపాల్లో అనుమతి లేని రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని ఆత్మకూరు ఆర్వో మధులత తెలిపారు. మద్యం దుకాణాలను పరిశీలించి బల్క్ ఆర్డర్‌పై మద్యం అమ్మవద్దని సూచించారు. పాన్‌బ్రోకర్లు బంగారం కుదువ పెట్టుకొని నగదు ఇవ్వొద్దని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

అనంతసాగరం, మార్చి 23: స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయంలో శనివారం అనంతసాగరం వ్యవసాధికారి శ్రీధర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. ధరల వివరాలను రైతులకు తెలియజేశారు.

కలువాయిలో 'బీఎస్ఎఫ్' కవాతు



కలువాయి, మార్చి 23: ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకుకోవాలని శనివారం కలువాయిలోని ప్రధాన వీధుల్లో బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించారు. వీరి వెంట రాపూరు సీఐ సుబ్రమణ్యం, కలువాయి ఎస్ఐ అయ్యప్ప ఉన్నారు.

వైభవంగా 16 రోజుల పండుగ



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, మార్చి 23: గండిపాలెం జలాశయం ఆవరణలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయంలో శనివారం 16రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించి 16రోజులు కావడంతో అర్చకులు లోకా ప్రసాద్‌శర్మ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేపట్టారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించారు.

మోడల్ కోడ్ కండక్ట్ అధికారి తనిఖీ

ఉదయగిరి, మార్చి 23: జీ.చెరువుపల్లి, బండగానిపల్లి, చెర్లోపల్లి పంచాయతీల్లో శుక్రవారం మోడల్‌కోడ్ కండక్ట్ అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఎన్నికల నిబంధనలకు ప్రకారం ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు తొలగింపుపై పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదని హెచ్చరించారు. ఆమె వెంట కార్యదర్శులు చినబాబు, అంజనేయులు ఉన్నారు.

'లింగ నిర్ధారణ'కు పాల్పడితే చర్యలు



ఆత్మకూరు : స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డివిజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌వీ సుధీర్‌కుమార్

ఆత్మకూరు, మార్చి 23: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ప్రభుత్వ నిబంధనలకు మేరకు స్కానింగ్ సెంటర్లును నిర్వహించాల్సి ఉందని డివిజనల్ ప్రోగామ్ ఆఫీసరు డాక్టర్ ఎన్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన వైద్యులు దినకర్, అనూషతో కలిసి ఆత్మకూరులోని పలు స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అవసరమైన మార్పులపై సూచనలిచ్చారు. రిపోర్టులను జిల్లా ఆరోగ్యశాఖాధికారికి పంపు తామన్నారు. స్కానింగ్ సెంటర్ల వద్ద ధరల పట్టిక, ప్రచార బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

ఉదయగిరి రూరల్: స్కానింగ్ తీసిన పిదప ఆడ, మగ అని లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని చాకలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.మురళీధర్ అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య ఆదేశాల మేరకు పట్టణంలోని వేణు, అనురాధ, శ్రీవిద్య ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో స్కానింగ్ సెంటర్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్కానింగ్ చేసే వైద్యుల వివరాలు, విద్యార్హతలు, రిజిస్టర్, రెన్యువల్ ధ్రువపత్రాలు వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు గురవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, మార్చి 23: స్థానిక గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్, కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మకూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ టి.కామేశ్వరి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఉదయగిరి రూరల్ : గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గండిపాళెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జే.పుష్పరాజ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా ముఖ్య కేంద్రాల్లో ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సీతారామపురం: ఏపీ మోడల్‌స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ ముజీబుర్ రెహమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి మార్చి 28నుంచి మే 22వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు చేపట్టాలి

ఉదయగిరి రూరల్, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిబంధనల మేరకే మద్యం విక్రయాలు చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మూడు ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కోడ్ అమల్లో ఉన్నందున మద్యాన్ని నిబంధనల మేరకే అమ్మకాలు చేపట్టాలన్నారు. ఎవరైనా అధిక మద్యం కావాలని ఒత్తిడి చేస్తే వారి వివరాలు తెలిజేయాలన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. అలాగే ఫంక్షన్ హాల్, కుదవ అంగళ్లను తనిఖీ చేశారు. రాజకీయ పార్టీ నాయకుల సభలు, సమావేశాలకు అనుమతులు ఉంటేనే నిర్వహించుకునేందుకు ఇవ్వాలన్నారు. కోడ్ అమలుకు అందరూ సహకరించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఇసుక రీచ్‌లకు అనుమతి లేదు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత

సంగం, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలుతో ఇసుక రీచ్‌లకు అనుమతి లేదని ఆత్మకూరు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు. శనివారం ఆమె పెన్నానదిలోని అధికారిక ఇసుక రీచ్‌ను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇసుక తరలించకూడదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం సంగంలో కల్యాణ మండపాలను పరిశీలించారు. కల్యాణ మండపాలల్లో ఎలాంటి రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్ఐ ఆదినారాయణ, సిబ్బంది ఉన్నారు.

అనంతసాగరం: పడమటికంభంపాడు ఇసుకరీచ్‌లో నిబంధనలను అతిక్రమించి ఇసుక రవాణా జరుగుతోంది. శనివారం అనంతసాగరం రెవెన్యూ, ఆత్మకూరు సెబ్ అధికారులు ఈ రీచ్‌ను పరిశీలించారు. ఈ సమయంలో వాహనాలన్నీ వెళ్లిపోయాయి.

15 వరకు సోమశిలకు నీటి విడుదల



కలువాయి మండల సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రనిధులు, అధికారులు

కలువాయి, మార్చి 23: సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పైర్లకు ఏప్రిల్ 15వరకు నీరిచ్చే ప్రయత్నం చేస్తామని సోమశిల ఏఈ మహేష్ తెలిపారు. మండల కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సీజన్‌లో దక్షిణ కాలువకు సోమశిల నీటి నిర్వహణను సరిపోయినట్లు చేశారని ప్రాజెక్టు అధికారులను జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కోడ్ వచ్చే నాటికి మొదలుపెట్టిన అభివృద్ధి పనులు చేసుకోవచ్చుని, కొత్తగా పనులు చేసేందుకు వీలుండదని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపా రు. సమావేశంలో శాఖల పరిధిలో జరుగుతున్న పనులను అధికారులు వివరించారు. ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ పంగా పెంచల నరసారెడ్డి, తహసీల్దారు సంజీవకుమారి పాల్గొన్నారు. మండల సమా వేశంలో చింతలపాళెం సర్పంచు కండే వెంకటసుబ్బమ్మ భర్త కండే కృష్ణయ్య, నూకనపల్లి సర్పంచు సుంకు మౌనిక భర్త సుంకు వెంకటకృష్ణయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకుపోగా సభ్యులు కానివారు సమావేశంలో ఉంటే బయటకు వెళ్లిపోవాలని ముందే తాను హెచ్చరించినట్లు తెలిపారు.

టీబీ నివారణపై వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ



బిట్రగుంట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బిట్రగుంట, మార్చి 23: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో శనివారం డాక్టర్ జిహారిక ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సులోచన, ఎఫ్ఎస్ మేరీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేటలో..

ఏఎస్ పేట: టీబీని పూర్తిగా నయం చేయవచ్చని ఏఎస్ పేట పీహెచ్‌సీ వైద్యులు సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామ విధుల్లో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా మందులు వాడకంతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో చిన్నయ్య, సూపర్‌వైజర్ రషీద్, ఎంపీహెచ్ఎస్ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు రసూల్, శీను, రవూఫ్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



ఏఎస్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వెద్యులు, సిబ్బంది

సీతారామపురం: వరల్డ్ టీబీడే నివారణను పురస్కరించుకొని సీతారామపురంలో వైద్యులు స్వప్న ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వప్న మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా బరువు తగ్గుతున్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయుం చుకోవాలని కోరారు. టీబీ నిర్ధారణ జరిగితే మందులు ఉచితంగా పంపిణీ, ఫుడ్ బాస్కెట్స్, ప్రతినెలా రూ.500లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మజీద్, పీహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ రియాజ్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంఎస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ సలహాలకు బృందం ఏర్పాటు

ఉదయగిరి రూరల్, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు న్యాయ సలహాలు అందించేందుకు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సూచన మేరకు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు శనివారం టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు తెలిపారు. బృం దంలో న్యాయవాదులు కల్లూరి తిరుపతయ్య, మనోరమ, సీహెచ్ రమేష్, ఎం.అశోక్, టీ.కిరణ్‌తో పాటు అనుబంధ సభ్యుడిగా నూతంగి తులసీని ఉంటారన్నారు. ఏ సమయంలోనైనా సరే సహాయ, సహకారాలు అందించేందుకు బృందం సిద్ధంగా ఉంటుందన్నారు. తనను నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికల బాధ్యతలు అప్పగించిన కాకర్ల సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రోడ్డు మార్జిన్‌లో గుంత.. వాహనచోదకుల చింత



రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలో కోతకు గురై గుంత ఏర్పడిన ఆర్అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, మార్చి 23: మండలంలోని తాతాహోటల్ నుంచి మొగిలిచెర్ల వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలో కోతకు గురైంది.దీంతో గుంత ఏర్పడడంతో వాహనదారులు భయంతో ప్రయాణిస్తున్నారు. మార్జిన్‌లోని గుంతలో నుంచి మట్టి ఎక్కువగా కోసుకుపోవడంతో పక్కనే ఉన్న కల్వర్టు కింద గోడ పడిపోయింది.దీంతో కల్వర్టు శ్లాబు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ప్రతినిత్యం అధిక సంఖ్యలో వాహనాలు వెళతుంటాయి. ప్రతి శని, ఆదివారాల్లో ఈ రోడ్డు మీదుగా మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయానికి, మాలకొండకు అధికంగా భక్తులు వెళుతుంటారు.సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీకి సీనియర్ల రాజీనామా

● టీడీపీలో చేరేందుకు ఇంటూరితో మంతనాలు

ఉలవపాడు, మార్చి 23: మండలంలోని వైసీపీ సీనియర్ నాయకులు ఆ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ గెలుపుకోసం అహర్నిశలు కష్టపడ్డామని,అయినా తమను ఎమ్మెల్యే పట్టించుకోలేదని పేర్కొన్నారు. బుర్రా మధుసూదన్ కూడా స్థానిక ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తూ తమను పూర్తిగా విస్మరించాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టి మూడు వారాలు అయినా కనీస పలకరింపులు లేవని వాపోయారు. గుర్తింపులేని పార్టీలో ఇమడలేక రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో శుక్రవారం రాత్రి ఉలవపాడులో వైసీపీ అసమ్మతి నేతలు సమావేశమై టీడీపీలో చేరేందుకు సమ్మతించారు. టీడీపీలోకి చేరనున్నవారిలో వైసీపీ సీనియర్ నాయకులు సుంకర చెంచురామిరెడ్డి, సూరం చిరంజీవిరెడ్డి, పులిచర్ల వెంకటసుబ్బారెడ్డి, అడపా వెంకట్రావు, తానికొండ రాజా, తోకల సుబ్బారావు, కూనం శ్రీనివాసులరెడ్డి తదితరులతోపాటు మరికొందరు ఉన్నారు.

దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపాలి : సౌజన్య

కందుకూరు : పట్టణంలో ఏ ప్రాంతానికి వెళ్లినా జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య కోరారు. పట్టణంలోని 6వ వార్డు విక్కిరాలపేట రోడ్డు, విజయబాలాజీ కల్యాణమండపం ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీచేసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అహ్మద్‌బాషా, షేక్ సలాం, తహరాబేగం, షాహీదా, మహబూబ్‌జానీ, నసీమా ఖరీమూన్, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో టీడీపీ ప్రచారం

కావలి : పట్టణంలోని ముసునూరు 14వ వార్డులో శనివారం బాబు షూరిటీ భవష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్‌పథకాల క్యాలెండర్లను, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎంగా చంద్రబాబు నాయుడిని గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, రావినూతల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి శ్రీనివాసులు కమ తం శ్రీను, మంద శేషయ్య, మంద శీనయ్య, మర్లపాటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరి నాగేశ్వరరావుతో చర్చిస్తున్న ఉలవపాడు వైసీపీ అసమ్మతి నేతలు



కావలి : టేబుల్ క్యాలెండర్ అందచేస్తున్న టీడీపీ నేతలు



కందుకూరులో సౌజన్య ప్రచారం

నేడు కందుకూరుకు వీపీఆర్ రాక

కందుకూరు, మార్చి 23: నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆదివారం కందుకూరులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారని అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెద్దబజారులోని సీతారామ ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆర్యవైశ్యులతో జరిగే ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పామూరు రోడ్డులోని ఎస్వీఎస్ కల్యాణమండపంలో టీడీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి23: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులకు ఈనెల 28 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95537 55139 నంబరును సంప్రదించాలని తెలిపారు.

513 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మార్చి 23: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 570 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 13కంపెనీల ప్రతినిధులు పాల్గొని 513బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-8, నో బిడ్-34, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-2 కారణాలతో 57బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.228.39గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

దగదర్తిలో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి సాల్మాన్‌రాజు

బిట్రగుంట, (దగదర్తి) :: దగదర్తి మండల పరిధిలోని పలుగ్రామ పంచాయతీల్లో శనివారం కావలి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ప్రచారం చేశారు. ఓసీగుంటపాలెం, సవటపుత్రుడు, తడకలూరు, దగదర్తి, చెన్నూరు, సిద్దారెడ్డిపాలెం, రంగసముద్రం, మనుబోలుపాడు, కామినేనిపాలెం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లా యర్ కోవూరుబాబు, నక్కగిరి, కే నవీన్ కుమార్, సుబ్రహ్మణ్యం, కిరణకుమార్ పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి



స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట : రద్దు చేసిన చెన్నై-బిట్రగుంట- విజయవాడ మెమూ రైళ్లను పునరుద్ధించాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం బిట్రగుంట స్టేషన్‌మాస్టర్ మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం షేక్ నూరుద్దీన్, నూకసాని శ్రీనివాసులుయాదవ్, దాసరి సునీల్ తదితరులు మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండే మెమూ రైళ్లను రద్దుతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెమే రైళ్లను త్వరగా పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జై భీం అంబేడ్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, శశికుమార్, సత్యనారాయణచార్యులు, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

బిట్రగుంట : బోగోలు మండలం జేపీ గూడూరు సెక్టారు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. సూపర్‌వైజరు డీ సుప్రజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కోడ్ ఉన్నా.. అమలు ఎక్కడ ?



అముదాలదిన్నెలో పార్టీ రంగులతో ఉన్న శిలాఫలకం

కావలి రూరల్, మార్చి23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఆచరణలో మాత్రం అమలు జరగడం లేదు. కావలి మండలం ఆముదాలదిన్నెలో మురుగు నీటి కాలువ నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకానికి అధికార పార్టీ నేతలు తమ పార్టీ జెండా రంగులు వేశారు. నిబంధనల మేరకు పార్టీ రంగులు తొలగించాల్సి ఉన్నా శిలాఫలకానికి కాగితాలు అంటించిన అధికారులు రంగులు మాత్రం అలాగే వదిలేశారు. అధికారుల తీరును గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

అనుమతులతోనే సమావేశాల నిర్వహణ

కందుకూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నేతలు ముందస్తు అనుమతులు లేకుండా కల్యాణ మండపాలు, ఇతర ప్రదేశాల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించటానికి లేదని, అలా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, సబ్ కలెక్టరు జి. విద్యాధరి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఆమె పరిశీలించారు. మద్యం దుకాణంలోని రికార్డులను స్టాకు, విక్రయాల వివరాలను పరిశీలించిన ఆమె ఎవరికి కూడా పెద్దమొత్తంలో మద్యం విక్రయించరాదన్నారు. అలా ఎవరికైనా మద్యం అందజేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. అలాగే పట్టణంలో పాన్ బ్రోకర్ సర్టిఫికెట్ కలిగిన వారు, ఇతర కుదువ వ్యాపారులు పెద్దమొత్తంలో బంగారం కుదువ పెట్టుకుని ఎవరికైనా నగదు ఇవ్వవద్దన్నారు. అలా ఇచ్చిన వారిపై చర్యలు తప్పవని సబ్ కలెక్టరు స్పష్టం చేశారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీ



మద్యం దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న కావలి ఈఆర్వో శీనానాయక్ తదితరులు

కావలి, మార్చి23 : సజావుగా ఎన్నికల నిర్వహణలో భాగంగా కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శీనానాయక్ శనివారం పట్టణంలో తనిఖీలు చేపట్టారు. ముందుగా ఒంగోలు బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేసి, అందులో ఉన్న రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరుపుతున్నారా ? లేక వారిష్టానుసారం విక్రయిస్తున్నారా.. వచ్చిన స్టాకు, అమ్మకాలకు, నిల్వకు సరిపోయిందా ? లేదా.. అని పరిశీలించారు. అలాగే విజయలక్ష్మి పాన్‌బ్రోకర్స్, దేవిశ్రీ పాన్‌బ్రోకర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. తదుపరి బృందావనం హౌసింగ్ కాలనీలోని కల్యాణ మండపంలో వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో, కావలి తహసీల్దార్ నగేష్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, మార్చి 23: భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు పీ మాలకొండయ్య, బీ సురేష్‌బాబు, ఎస్కే హుస్సేన్, వై. ఆనంద్ మోహన్, బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కావలిటౌన్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో ఘననివాళుల ర్పించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నలంద పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పలువురు నేతలు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నేతలు లోకేష్, వర్షిత్, భాను, డీవైఎఫ్ఐ నేతలు కృష్ణమోహన్, నరసింహ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

చెంచుగానిపాలెంలో రక్తదానం శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలి, మార్చి23: స్థానిక శ్రీచైతన్య డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులకు బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పేరూరి వెంకటసాయి తేజ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



తడారుతున్న గొంతుల

జలదాత వీపీఆర్

- ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో అందవేసిన చేయి
- నిరుపేదలకు పట్ల తండ్రి లాంటి వాత్సల్యం
- సేవల్లో దిట్ట.. అవార్డులకే వన్నెతెచ్చిన 'ప్రభాకరుడు'
- దేశ విదేశాల్లోనూ పేరుప్రతిష్టలు



నెల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

వీపీఆర్ ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు... గొంతెండుతున్న గ్రామాలకు నీటిశుద్ధి ప్లాంట్లు... పైసా ఖర్చు లేకుండా పేద విద్యార్థులకు ఉచితంగా ఉత్తమ విద్య అందించడం.... అంగరంగ వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ... వీటన్నింటితోపాటు అన్నార్థులకు, అనాథ శరణాలయాలకు టక్కున గుర్తువచ్చే మూడక్షరాల పేరు వీపీఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి). జిల్లా ప్రజలకు వీపీఆర్ ఫౌండేషన్ అంటేనే ఒక గౌరవం. సాయం అందిస్తారన్న నమ్మకం. ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన పేరుతో స్థాపించిన ఈ ఫౌండేషన్ నెల్లూరు జిల్లాలో వందలాది గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నిరుపేద పిల్లలకు ఉచితంగా ఉత్తమ విద్య అందించాలనే ధ్యేయంతో ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తోంది. దైవిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ఆపదలో ఉన్న ఎంతోమందిని ఆదుకుంటోంది.



సమాజ సేవలో వీపీఆర్ ఫౌండేషన్ తనవంతు సాయం అందిస్తోంది. కరోనా సమయంలో ఈ ఫౌండేషన్ జిల్లా వ్యాప్తంగా లక్షలాదిగా శానిటైజర్ బాటిల్స్, మాస్కులు పంపిణీ చేసింది. 10 లీటర్ల సామర్థం కలిగిన 100 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ మిషన్లను ఉచితంగా అందజేసింది. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఐసొలేషన్ కేంద్రాల్లో కరోనా బాధితులకు, వారి సహాయకులకు ఉచిత భోజన సదుపాయం కల్పించింది. ఇంకా ఏమి చేసిందంటే..

సమాజానికి తన వంతు సాయం

- జయభారత్ ఆసుపత్రిలో పేదవారికి కోసం గుండె జబ్బుల విభాగంలో స్కానర్, కలర్ డాప్లర్ ఏర్పాటు
- నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి అధునిక సదుపాయాలతో కూడిన అంబులెన్స్ విరాళం
- స్వర్ణభారత్ ట్రస్టులో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విభాగంలో ఆపరేషన్ థియేటర్ నిర్మాణం, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రంతో సహా పలు ప్రజోపయోగ కార్యక్రమాలకు ఆర్థిక సాయం
- భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి తోడ్పాటుతో వందలాదిమంది కాళ్లు లేని వారికి జైపూర్ ఫుట్‌ను ఉచితంగా అమర్చడం
- పాఠశాలలకు, ఆసుపత్రులకు ఆహారాన్ని సరఫరా చేయడానికి అవసరమైన వాహనాన్ని ఇస్కాన్ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఇస్కాన్ ప్రాంగణంలో గోశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేశారు.
- తనకు విద్యాబుద్ధులు నేర్పిన రిషివ్యాలీ స్కూలు అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణానికి తనవంతు సాయం అందించారు
- వెయ్యిమందికి పైగా మానసిక వికలాంగులకు అండగా నిలుస్తున్న తమిళనాడు స్పాస్టిక్ సొసైటీకి పలుసార్లు ఆర్థిక సాయం
- వాత్సల్య అనాథ శరణాలయానికి భవన నిర్మాణం కోసం ఆర్థిక సాయం. ప్రతి ఏటా అక్కడ నివసించే పిల్లలకు ఒక నెల పాటు భోజన ఖర్చు భరించడం
- మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య నేతృత్వంలో నడుస్తున్న మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమంలో భవన నిర్మాణానికి ఆర్థిక సాయం.
- నెల్లూరులోని ప్రగతి చారిటీస్ నిర్వహణకు ప్రతి ఏటా ఆర్థిక సాయం
- నెల్లూరు పెన్నా తీరాన హిందూ శ్మశాన వాటికలో దహనశాల నిర్మాణం.
- జిల్లా క్రీడా మండలి ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియానికి ఆర్థిక సాయం.
- పోలీస్ పరేడ్ మైదానంలో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం
- నెల్లూరు రామూర్తినగర్ పురపాలక పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సాయం.
- స్లీపింగ్ చిల్డ్రన్ అరౌండ్ ది వరల్డ్ (ఎస్‌సీఏడబ్ల్యూ) వీపీఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 3వ తరగతి చదివే 2000 మంది పేదవిద్యార్థులకు బెడ్‌కిట్స్ పంపిణీ.

తాగునీరు అందించిన జలదాత

వీపీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న మరో మంచి పథకం అమృతధార. జిల్లాలో చాలా గ్రామాలు ఫ్లోరైడ్ నీటితో అల్లాడుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన వాటిని ఆదుకోవడానికి నడుం బిగించారు. ఇప్పటికి వందకుపైగా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రామీణులకు ఉచితంగా శుద్ధ జలాన్ని అందిస్తున్నారు. ఫ్లోరైడ్, టీడీఎస్, క్లోరైడ్ శాతం అధికంగా ఉన్న హైరిస్క్ గ్రామాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లు స్థాపిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 38 మండలాల్లో 101 ఆర్‌వో ప్లాంట్లను సొంత నిధులతో ఆయన ఏర్పాటు చేశారు. ఎంపీ నిధులతో మరో 14 ఆర్‌వో ప్లాంట్లను స్థాపించారు.ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి వదిలేయకుండా టెక్నికల్ నిర్వహణ కూడా వీపీఆర్ ఫౌండేషనే నిర్వహిస్తున్నది. సంఖ్యతో పని లేకుండా నెల్లూరు జిల్లా ప్రజలందరికీ శుద్ధిజలం అందించాలన్నది వీపీఆర్ ఆశయం.



స్కూల్‌లో నేర్చుకున్న లక్షణాలను ఆచరిస్తూ..

తనకు విద్యనేర్పిన రిషివ్యాలీ స్కూలు నుంచి నేర్చుకున్న మంచితనం, మానవత్వం, దానగుణంతో వీపీఆర్ వ్యాపార రంగానికి సమాంతరంగా సేవామార్గాన్ని కూడా ఎంచుకున్నారు. తన ప్రతిభతో ఒక వైపు పారిశ్రామికవేత్తగా రాణిస్తూనే మరో వైపు తనపేరుతో స్థాపించిన వీపీఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారు. 2015లో పురుడుపోసుకున్న వీపీఆర్ ఫౌండేషన్ 8ఏళ్లుగా సమాజసేవలో ప్రసంశనీయమైన పాత్ర పోషిస్తోంది. వీపీఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు.

వీపీఆర్ విద్య

నిరుపేదలకు కార్పొరేట్ విద్య అందించాలన్న సంకల్పంతో పాఠశాల స్థాపించారు. 2016లో కనుపర్తిపాడు సమీపంలో ప్రారంభమైన ఈ పాఠశాల కార్పొరేట్ వసతులను మించిన అత్యున్నత ప్రమాణాలతో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. తొలిఏడాది 99 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఈ పాఠశాల గడచిన 9ఏళ్లలో ఎంతో మంది పేద పిల్లలకు ఉచిత విద్య అందించింది. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, భోజనం, యూనిఫాం, వైద్య సదుపాయం, బస్సు సౌకర్యం అన్నీ కూడా ఉచితమే. పాఠ్యాంశాల బోధనకే కాకుండా వ్యక్తిత్వ వికాస బోధనకు ఈ స్కూలులో పెద్ద పీట వేస్తున్నారు. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది, ల్యాబ్‌లు, విశాలమైన క్రీడామైదానంతో ఈ స్కూలు జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ స్కూలు పిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రత్యేక శ్రద్ధ చూపడం విశేషం. తనకు ఎప్పుడు సమయం దొరికినా స్కూలుకు వెళ్లి పిల్లలతో గడపడానికి వీపీఆర్ ఆసక్తి చూపిస్తుంటారు. దీని బట్టి చూస్తే నిరుపేద పిల్లల పట్ల ఆయనకున్న అభిమానం ఎలాంటిదో అర్థం అవుతుంది.

వీపీఆర్ వైద్యం

వీపీఆర్‌ఆర్ స్కూలు ఆవరణలోనే ఫౌండేషన్ ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తోంది. ఈ ఆసుపత్రికి వెళితే డాక్టరుకు కన్సల్టేషన్ ఫీజు ఇవ్వాల్సిన అవసరం లేదు. పైగా ఎక్స్‌రే, ఈసీజీ, ఇతర ఆరోగ్య పరీక్షలు అన్ని ఉచితంగా చేస్తారు. మందులు కొనే స్థోమత లేని పేదలకు అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.





వీపీఆర్ ఆధ్యాత్మికం

సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ వీపీఆర్ ముందుంటారు. రాష్ట్రంలోని పలు ఆలయాలకు భూరి విరాళాలు అందజేయడమే కాకుండా పెద్దఎత్తున దైవిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుమలలో అతిథి గృహం నిర్మించి శ్రీవారికి కానుకగా సమర్పించారు. 2015 నుంచి 2022 వరకు నెల్లూరులో జరిగిన శ్రీవెంకటేశ్వర వైభవోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ గాలిగోపుర నిర్మాణం, బంగారు కలశస్థాపన, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మహా కుంభాభిషేకం, బంగారు కలశస్థాపన, శ్రీశైలం దేవస్థానానికి బంగారు రథం బహూకరణ, భక్తుల కోసం ఉచిత వసతి గదుల నిర్మాణం, జిల్లాలోని రామతీర్థంలోని రాములవారి గుడికి పునఃనిర్మాణం, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ అభివృద్ధి, కుంభాభిషేకం, జొన్నవాడ కామాక్షితాయి ఆలయ అభివృద్ధికి భూరి విరాళాలు అందజేశారు. అల్లూరులో ప్రతి ఏటా పోలేరమ్మ జాతర, ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే జగన్నాథ రథయాత్ర సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు, ప్రతి ఏటా కార్తీకమాసంలో లక్ష దీపోత్సవం కార్యక్రమానికి చేయూత అందించారు. షిర్డిసాయి బాబా నిజపాదుకలను నెల్లూరుకు తీసుకువచ్చి ప్రజలకు దర్శనభాగ్యం కల్పించారు.





అందుకున్న పురస్కారాలు ఎన్నో..

- 2006లో ప్రపంచ ప్రఖ్యాత సంస్థ జెసీస్ ద్వారా ఉత్తమ వ్యాపారవేత్త పురస్కారం అదుకున్నారు
- 2008లో ప్రఖ్యాత వోల్వో సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించే అంతర్జాతీయ కేలండర్‌లో స్థానాన్ని సంపాదించుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు
- 2009లో బెజవాడ గోపాలరెడ్డి అవార్డు
- కొమస్టో అనే అంతర్జాతీయ భారీ వాహనాల సంస్థను దేశానికి పరిచయం చేయడమే కాకుండా, దక్షిణ భారతంలోనే ఆ సంస్థకు అతిపెద్ద ఖాతాదారునిగా గుర్తింపు పొందారు.
- 2018లో అమెరికా నాటా ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకమైన జీవిత సాఫల్య అవార్డు అందుకున్నారు.
- ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా 2018లో సేవా భూషణ్ బిరుదు అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన సేవలకు అందని అవార్డు అంటూ లేదు.



రాజకీయాల్లో అరుదైన గుర్తింపు

వీపీఆర్ దంపతులు అనుసరిస్తున్న సేవా మార్గానికి రాజకీయ రంగంలోనూ అరుదైన గుర్తింపు లభించింది. సాధారణంగా పార్టీలో చేరికలు ఆ పార్టీ అధినేత నివాసం వద్దో, రాష్ట్ర పార్టీ కార్యాలయాల్లోనో జరుగుతాయి. కాని వీపీఆర్ దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరిక సందర్భంగా ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నెల్లూరుకు వచ్చారు. వీపీఆర్ లాంటి వ్యక్తులను గౌరవించడం తన బాధ్యతగా గుర్తించి తానే స్వయంగా నెల్లూరుకు వచ్చినట్లు వేలాది మంది గుమికూడిన సభలో చంద్రబాబు ప్రకటించారు. రాజకీయ రంగంలో ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీలో ఈ దంపతులకు పట్ల ఉన్న గౌరవాభిమానాలకు చంద్రబాబు వ్యాఖ్యలే నిదర్శనం. ఈ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి టిక్కెట్లు కేటాయించిన కుటుంబాలు నాలుగే. చంద్రబాబు, యనమల, అచ్చెన్నాయుడు కుటుంబాలైతే ఆ అరుదైన అవకాశం దక్కిన నాల్గవ కుటుంబం వేమిరెడ్డి ప్రభారరెడ్డిది కావడం విశేషం. తెలుగుదేశం పార్టీ నుంచి నెల్లూరు పార్లమెంట్‌కు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పోటీ చేస్తున్నారు.





సర్వేపల్లి బిడ్డల భవిష్యత్తు కోసం

ఈ ఒక్కసారికి గెలిపించండి

● వెంకయ్యస్వామికి సోమిరెడ్డి పూజలు



వెంకయ్యస్వామికి పూజలు చేస్తున్న సోమిరెడ్డి దంపతులు

వెంకటాచలం, మార్చి 23 : సర్వేపల్లి బిడ్డల భవిష్యత్తు కోసం ఈ ఒక్కసారికి ప్రజలందరూ ఆలోచించి తనకు ఓటు వేసి గెలిపించాలని సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఉదయం సోమిరెడ్డి దంపతులు భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ప్రజలను, ఆస్తులను దోపిడీ రాజ్యం నుండి రక్షించాలని స్వామి సన్నిధిలో కోరుకున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ, పేదల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, వాటిని కాపాడేందుకు రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వల్లూరు రమేష్‌నాయుడు, నాయకులు ధనుంజయనాయుడు, పద్మనాభనాయుడు, పార్థసారధినాయుడు, రవినాయుడు, సత్తార్ సాహెబ్, శ్రీనివాసులు, దామోదర్, సుజిత్, వెంకయ్య తదితరులున్నారు.

వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో శనివారం మండలంలోని చెముడుగుంట గ్రామానికి చెందిన టీడీపీ నేత దొడ్ల అశోక్ ఆధ్వర్యంలో వైసీపీ నుండి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే 1994 నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయని, భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 23: మండలంలోని పంచేడులో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి సూరా సురేంద్రరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. కాగా, సురేంద్రరెడ్డి ఆహ్వానం మేరకు వేమిరెడ్డి దంపతులు వారి ఇంటికి వెళ్లి అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. వారి వెంట టీడీపీ నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, ఎంవీ శేషయ్య, బత్తల హరికృష్ణ, బండ్ల కొండయ్య, తాళ్ళస్వామి, నాపా వెంకటేశర్లునాయుడు, టీడీపీ నాయకులున్నారు.

నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రకు భారీగా తరలిన తెలుగు మహిళలు



నిజం గెలవాలి యాత్రకు బయలుదేరిన తెలుగు మహిళలు

పొదలకూరు, మార్చి 23 : వెంకటాచలం మండలం పారిచర్లపాడు గ్రామంలో శనివారం నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్రకు పొదలకూరు టీడీపీ అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆదాల సుగుణమ్మ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని, రాష్ట్రం బాగుపడాలంటే మహిళలందరూ చంద్రబాబును ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

గాంధీ ఆశ్రమంలో అమరవీరుల దినోత్సవం



భగత్‌సింగ్, రాజ్‌గురు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న పాఠశాల విద్యార్థులు

ఇందుకూరుపేట, మార్చి 23: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల భగత్‌సింగ్, రాజ్‌గురు చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, దార్ల సుబ్రహ్మణ్యం, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులకు మైనార్టీ నేతల మద్దతు



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు, మార్చి 23: నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామని దూదేకుల, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి హస్నుభాయ్ తెలిపారు. ఈమేరకు శనివారం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలను నెల్లూరులోని వారి నివాసంలో తమ కార్యకర్తలతో కలిసి మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి విజయాన్ని చేకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సుభాన్, అల్తాఫ్, ఆలీ, ఎస్‌కె రఫీ పాల్గొన్నారు.

అమలుకాని ఎన్నికల కోడ్...!

● తొలగని అధికార పార్టీ ఫ్లెక్సీలు, బ్యానర్లు



ఎంఆర్‌వో కాలనీలో ముసుగువేయని అధికార పార్టీ శిలాఫలకం

పొదలకూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. పలు ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించలేదు. సీఎం జగన్, మంత్రి కాకాణి చిత్రాలతో ఉన్న శిలాఫలకాలకు ముసుగు వేయలేదు. పట్టణంలో బిట్-1 సచివాలయం సమీపంలోని ఎంఆర్‌ఓ కాలనీ ప్రధాన రోడ్డును ఆనుకుని వున్న శిలాఫలకంపై సీఎం జగన్, కాకాణి చిత్రాలు వున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సైడు కాలువల ప్రారంభం వద్ద సీఎం, మంత్రి కాకాణి చిత్రాలతో ఉన్న శిలాఫలకాన్ని అలాగే వదిలేశారు. పలు ప్రాంతాల్లో శిలాఫలకాలకు ముసుగు వేయలేదు. ఇక పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పలు ఆటోలపై ముఖ్యమంత్రి జగన్ చిత్రాలతో కూడిన సిద్ధం పోస్టర్లు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త వెస్సెల్ షెడ్యూల్ విడుదల చేయాలి

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ కొత్త వెస్సెల్ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కంటైనర్ టెర్మినల్ ఆధారిత ఉద్యోగులు డిమాండ్ చేశారు. గోపాలపురంలో శనివారం కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ ఆధారిత ఉద్యోగులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎక్స్‌పోర్టర్లు, లైనర్లు, బుకింగ్స్ ఉన్నాయని, వెస్సెల్ షెడ్యూల్ విడుదల చేయమని అడిగితే పోర్టు యాజమాన్యం స్పందించడం లేదని, రాబోయే కొత్త సీఈవో అయినా వెస్సెల్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో పోర్టుని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, ఆనంద్, అజయ్, దిలీప్, శ్రీను పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో విజయసాయి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని శనివారం ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



సమావేశంలో పాల్గొన్న పొన్నవోలు

● ఎన్నికల సమావేశంలో అడ్వొకేట్ జనరల్

పంచేడులో జరిగిన ఎన్నికల ప్రచారం అనంతరం సూరా సురేంద్రరెడ్డి నివాసంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల సమావేశంలో అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. వెంటనే ఎమ్మెల్యే ప్రసన్న అప్రమత్తమై ఆయన్ను పక్కకు పంపించారు. అయితే సురేంద్రరెడ్డికి బంధువుగా పొన్నవోలు అక్కడికి వచ్చారని చెబుతున్నారు.

పైనంపురంలో కాకాణి ఎన్నికల ప్రచారం

ముత్తుకూరు, మార్చి 23 : మండలంలోని పైనంపురంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు పాల్గొన్నారు.

కాకాణి గెలుపు కోసం కాలినడకన గొలగమూడికి

పొదలకూరు : కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలవాలని కోరుకుంటూ పట్టణంలోని కొందరు వైసీపీ నాయకులు పొదలకూరు శివాలయం నుంచి గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి గుడికి కాలినడకన నడిచివెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ నాయకుడు మొలబంటి శేఖర్‌బాబు, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దాడిపై పోలీసులకు మహిళ ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 23: తనపై ఓ వ్యాపారి కత్తితో దాడిచేశాడని స్థానిక కూరగాయల మార్కెట్టు వీధిలో కోడిగుడ్లు, టెంకాయల వ్యాపారం చేసుకునే దొరసానమ్మ అనే మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన దుకాణంలో డబ్బులు గల్లంతు కావడంపై విచారించుకున్నందుకు అదే ప్రాంతంలో ఓ దుకాణానికి చెందిన వ్యాపారి, ఆమె బంధువులు శుక్రవారం దాడి చేశారని బాధిత మహిళ వాపోయింది. ఈమేరకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తామని సీఐ హైమారావు తెలిపారు.

ఆలయ రహదారిపై కంచె తొలగింపు

తోటపల్లిగూడూరు, మార్చి 23: పేడూరు శ్రీచాముండేశ్వరి దేవాలయం రహదారి మార్గాన్ని కొద్దిరోజుల క్రితం స్థానిక రైతు తన పట్టాభూమి అంటూ కంచెతో మూసివేశాడు. దీంతో గ్రామస్థులు, భక్తులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో పరిష్కారం చూపాలని అధికారులతో చెప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. కానీ జాప్యం జరగడంతో భక్తులు శనివారం కంచెను తొలగించారు. తహసీల్దారు మాధవరెడ్డి, ఎస్‌ఐ జంపాని కుమార్ దేవస్థానం వద్దకు రావడంతో ఆలయ పూజారి, గ్రామస్థులు, భక్తులు వారికి వాస్తవాలు వివరించారు. రెవెన్యూ పరంగా అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని ఆలయ నిర్మాణ దాతలు పేర్కొన్నారు. దీంతో అధికారులు సమస్య జఠిలం కాకుండా సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

అవినీతికి కేరాఫ్ విజయసాయిరెడ్డి

● టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



ఎన్నికల ప్రచారంలో కోటంరెడ్డి, తదితరులు

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 23 : అవినీతికి కేరాఫ్‌గా ఉన్న వైసీపీ నేత విజయ సాయిరెడ్డి తెలుగు దేశం పార్టీ అభ్యర్థులను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పదో డివిజన్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ నారాయణ అని, నగరంలో ఆయన చేసిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. సొంత జిల్లాలో ఒక్క అభివృద్ధి కూడా చేయని విజయసాయిరెడ్డి ఏముఖం పెట్టుకుని ఓట్లడు గుతారని హేళన చేశారు. జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలను టీడీపీ కైవసం చేసుకోబోతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమల నాయుడు, వెంకటరావు, విజయకుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.



చంద్రబాబుతోనే యువతకు ఉద్యోగావకాశాలు

● నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 23 : ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 24 నుంచి 31వ డివిజన్ల యువతతో శనివారం నెల్లూరు రూరల్ టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపాలని కోరారు.

● టీడీపీలో చేరిక

మాజీ కౌన్సిలర్ పసుపులేటి శ్రీనివాసులు, 33వ డివిజన్‌కు చెందిన స్థానిక మహిళా నేతలు నిర్మలమ్మ, శ్రీదేవి, ప్రవల్లిక తదితరులు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం 1వ డివిజన్ నారాయణరెడ్డిపేట మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ కార్యాలయానికి కోడ్ వర్తించదా?



బీజేపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీకి అంటించిన స్టిక్కర్లు



వైసీపీ కార్యాలయం వద్ద తొలగించని కటౌట్‌లు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), మార్చి 23: నగరంలోని 47వ వార్డులో వైసీపీ కార్యాలయానికి లేని ఎన్నికల నియమావళి బీజేపీ కార్యాలయానికి వచ్చిందా అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ప్రశ్నించారు. నగరంలోని 47వ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలకు మున్సిపల్ అధికారులు తెల్లని స్టిక్కర్లు అతికించారన్నారు. ఇదే ప్రాంతంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకుల ఫొటోలు, పార్టీ గుర్తులు అలాగే ఉంచడంపై మున్సిపల్ అధికారుల తీరును విమర్శించారు. ఎన్నికల వేళ అధికార పార్టీ నాయకులకు అధికారులు కార్యకర్తలుగా విధులు నిర్వహించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరు నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సితార రెస్టారెంట్ ప్రథమ వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 23 : నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని సితారా రెస్టారెంట్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో రెస్టారెంట్స్ ఫుడ్స్‌పై 10 శాతం ప్రత్యేక రాయితీలు అందిస్తున్నామని సితారా మల్టీ కుషన్ రెస్టారెంట్ అధినేత చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే మీటింగ్‌లు, బర్త్‌డే పార్టీలకు, ఇతర ఫంక్షన్‌లకు 200 సీటింగ్ కలిగిన ఫంక్షన్ హాలును అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. తమ వద్ద 40 ఏళ్ల అనుభవం కలిగిన చెఫ్‌లు ఉన్నారని తెలిపారు. సితార మల్టీకుషన్ రెస్టారెంట్‌ను ఆదరించిన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన

నెల్లూరురూరల్, మార్చి 23 : ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని సౌత్‌మోపూరు కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మి అన్నారు. శనివారం గ్రామంలో తమ కళాశాలలో ఇంటర్ కోర్సుల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఆమె కలసి కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నిపుణులైన అధ్యాపక బృందం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి



కరపత్రాలు పంచుతున్న రమాదేవి

నెల్లూరు(వైద్యం), మార్చి 23 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని మాజీమంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి స్పష్టం చేశారు. శనివారం ఆమె 15, 40వ డివిజన్‌లలో పర్యటించారు. బాబూష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి టీడీపీ కరపత్రాలను పంచిపెట్టారు. ఓ టిఫిన్ దుకాణంలో దోశెలు పోసి అందరినీ ఆకట్టుకున్నారు. ఆమె రమాదేవి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో నారాయణ గెలిస్తే అండర్‌గ్రైండ్ డ్రైనేజీ పూర్తిచేసి దోమలను నివారిస్తారని, నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దటమే ఆయన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురకు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



రక్తదానం శిబిరం ప్రారంభిస్తున్న మాదాల, తదితరులు


నెల్లూరు(విద్య), మార్చి 23: భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందామని డీవైఎఫ్ఐ నేత కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్థంతి కార్యక్రమాలు నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, బీవీ.నరసింహం, ఎంవీ.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, ఎం.శ్రీహర్ష, నాయకులు చైతన్య, ఫయాజ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నెల్లూరు(వైద్యం) : నెల్లూరు నగరంలోని అపోలో ఆసుపత్రి సెంటర్‌లో భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, నేత కట్టా సతీష్, పిట్ల సూర్యనారాయణ, అల్లంపాటి శ్రీనివాసులరెడ్డి, నజీర్, ప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా మెదడుకు క్లిష్టమైన శస్త్ర చికిత్స

● సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), మార్చి 23 : నెల్లూరు నగరంలోని నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో మెదడుకు సంబంధించి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన గురుస్వామి(57)ని తీవ్రమైన తలనొప్పితో అపస్మారక స్థితిలో నారాయణ ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు. పరీక్షలు నిర్వహించగా రక్తనాళాలు బలహీనంగా ఉండి 5 ఎన్యురిజమ్‌లు(మల్టిపుల్ ఇంట్రాక్రేనియల్ ఎన్యురిజమ్) ఏర్పడినట్లు గుర్తించి శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. అలాగే తిరుపతి జిల్లా కురుగొండకు చెందిన ఉష(49)కు, నెల్లూరు జిల్లా టీపీగూడూరుకు చెందిన రమణమ్మ(57)కు శస్త్రచికిత్సల ద్వారా ఎన్యురిజమ్‌కు శస్త్ర చికిత్సలు చేశామని, వారు కోలుకుంటున్నారని చెప్పారు. నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రూ.25 లక్షలు చేసే ఈ శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్, డాక్టర్ కృష్ణచైతన్య, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుపై ప్రజల నిరసన

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 23 : నగరంలోని 31వ డివిజన్ సుజాతమ్మ పౌల్ట్రీ ఫారమ్స్ వద్ద పెట్రోలు బంకు ఏర్పాటుపై 30, 31వ డివిజన్ ప్రజలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు - పొదలకూరు మెయిన్‌రోడ్డు ఆనుకుని దాదాపు 200 అంకణాలు స్థలం ఖాళీగా ఉంది. దాని విలువ దాదాపు రూ.20కోట్లు ఉంటుంది. 1983లో సుజాతమ్మ పౌల్ట్రీ ఫారమ్స్ ఏర్పాటు సమయంలో ఆ స్థలంను పబ్లిక్ పర్పస్ కోసం కేటాయించారు. అప్పటి నుంచి ఆ కాలనీ వాసులు దానిని ఆక్రమణకు గురికాకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. ఆ స్థలంలో పార్కు, బడి, ప్రభుత్వ వైద్యశాల లేదా డివిజన్ సచివాలయాలు నిర్మించాలని కాలనీ వాసులు క్రమం తప్పకుండా జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాలు ఇస్తున్నారు. కొంతమంది ఆక్రమించబోతే, తహసీల్దారు కంచె వేసి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. ఎన్నికల కోడ్ ఉన్నా అలాంటి స్థలంలో నగరపాలక సంస్థ పెట్రోలు బంకుకు కేటాయించడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదేప్రాంతంలో 2 పర్లాంగుల దూరంలోనే పెట్రోలు బంకు ఉంది. ప్రజలకు ఉపయోగపడే వాటిని ఏర్పాటు చేయకుండా జనవాసాల మధ్య పెట్రోలు బంకు ఏర్పాటు చేయడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ముస్లింలు షామియానా వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పెట్రోలు బంకుపై విముఖత వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఫాల్గుణ పౌర్ణమి

● రంగుల పండుగ హోలీ

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 23 : తెలుగు మాసాల్లో చివరి మాసం ఫాల్గుణం. ఫాల్గుణ మాసం చివరిన వచ్చే పౌర్ణమిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆ రోజునే మహాలక్ష్మీ జయంతిని జరుపుకుంటారు. గృహాలు, దేవాలయాల్లో లక్ష్మీనారాయణ పూజలు, సత్యనారాయణ వ్రతాలు, లక్ష కుంకుమార్చన, తదితర పూజలు జరుపుతారు. ఈ పౌర్ణమినాడే చైతన్య మహాప్రభు జన్మదినోత్సవం జరుపుకుంటారు.

● హోలీ అనేది రంగుల పండుగ. వసంతకాలంలో ఈ పండుగ వస్తుంది. వసంతకాలంలో వాతావరణం మార్పులు వస్తాయి. ఈ కాలంలో వైరల్ జ్వరం, జలుబులు వంటి రుగ్మతలు వస్తాయి. హోలీ సందర్భంగా సహజ సిద్ధమైన రంగులు చల్లుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతోంది.

● రసాయన రంగులు ప్రమాదకరం

పట్టణ, నగర ప్రాంతాల ప్రజలు కృత్రిమ రంగులతో హోలీ పండుగ చేస్తారు. కృత్రిమ రంగులు చల్లుకోవడం ప్రమాదకరం. వీటిలోని రసాయనాలు కారణంగా మూత్రపిండాలు దెబ్బతినడం, కేన్సర్, చర్మవ్యాధులు, కంటి అలర్జీ వంటి వ్యాధులు వస్తాయి.

● హోలికా దహనం

చిన్నారులకు వచ్చే దిష్టి అనారోగ్యాల నుంచి విముక్తి కొరకు హోలికా దహన్ నిర్వహిస్తారు. దీనిని మార్వాడీలు, రాజస్థానీలు సంప్రదాయబద్ధంగా జరుపు తారు.

రేపు లక్ష్మీ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 23 : ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భగా సోమవారం నగరంలోని సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం పంచామృతాభిషేకం, నాణెములతో అభిషేకం, లక్ష కుంకుమార్చన, స్వర్ణ మహాలక్ష్మీ అమ్మవారికి పుష్పాభిషేకాలు, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం, అన్నప్రసాద వితరణలు, రాత్రి స్వర్ణమహాలక్ష్మీకి పల్లకీసేవ జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

నెల్లూరు(విద్య), మార్చి 23 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు మల్టీనేషన్ కంపెనీలో ప్లేస్‌మెంట్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు సయ్యద్ వలీల్‌మహ్మద్, జెమినీ కుమార్, షేక్.అబ్దుల్‌ముజిషిల్, తల్లూరు దినేష్‌లు ట్రిఫెక్టా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించారన్నారు. వారి అభినందించారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కె.వెంకటలక్ష్మి, ప్లేస్‌మెంట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు తిరుమల ప్రసాదం

నెల్లూరు(వైద్యం), మార్చి 23 : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార మండలి జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో రోగులకు శనివారం తిరుమల లడ్డూతో పాటు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ధార్మిక మండలి తరఫున డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, టీటీడీ ప్రచార జిల్లా అధికారి ఆర్ స్వామి, ధర్మప్రచార మండలి సభ్యులు రవికుమార్, జయరామయ్య, డాక్టర్ రమణయ్య, వెంకటేశ్వర్లు, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, గుర్రం సుధాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

టీడీపీ నేత నానికి తప్పిన ప్రమాదం

చంద్రగిరి, మార్చి 23: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారును గుంటూరు సమీపంలో వెనుక నుంచి ఓ టిప్పర్ ఢీకొంది. శనివారం విజయవాడలో జరిగే టీడీపీ సమావేశానికి నాని వెళుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది.కారులో ఉన్న తమకేం జరగలేదని నానీ తెలిపారు.ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిసి టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షుడు సుబ్బుయాదవ్ ఆధ్వర్యంలో మంగళంలోని సప్తగిరికాలనీ టీడీపీ నాయకులు శివాలయంలో 51 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.రామ్మూర్తి యాదవ్, అల్లాబాషా, హరికృష్ణ, గోపాల్‌యాదవ్, చెరుకూరి కిషోర్, నందిమంగళం గోపి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు బీఎస్పీ నేతలపై చోరీ కేసు

నాగలాపురం, మార్చి 23: సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఏడుగురు బీఎస్పీ నేతలపై పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు.ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు.. సత్యవేడు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ధనంజయన్ ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సుబ్బానాయుడు కండ్రిగలోని రీచ్ వద్ద ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో రీచ్ ప్రతినిధులకు, బీఎస్పీ నేతలకు మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ సందర్భంగా బీఎస్పీ నేతలు రీచ్ సిబ్బంది వద్ద నగదు ఉన్న సంచిని లాక్కొని, తిరిగి ఇచ్చారని.. అయితే అందులో నుంచి రూ.2,15,400 చోరీ చేశారంటూ రీచ్ ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఎస్పీ నేతలు పృథ్వీరాజు, వనరాజు, విద్యాసాగర్, అదిశయ రాజ్, చిన్న, వేలాంగన్నిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.27

సహరి (సోమవారం) : ఉ. 4.55

ఏమి ఎండలు సామీ!



నా వల్ల గాదు సామీ...





హమ్మయ్య! నీటి తుంపర్లకింద తడుస్తున్న చిరుత



ఈ చారెడు నీళ్లయినా మిగలతాయో లేదో అడుగంటిన మడుగులో బాతులు



ఎంత గజరాజైనా... నీటిమడుగులో ఒళ్లు తడుపుకుంటున్న ఏనుగులు



కొమ్ములు ఎండి బోడువై నీడ కరువై... నడిఎండ వేళ జింకల అవస్థలు

వేసవి వేడిసెగల తాపంతో తిరుపతి జూపార్క్ లోని జంతుజాలం హడలిపోతోంది. అడవిలో అయితే నీడనూ, నీటి జాడలనూ వెతుక్కుంటూ వెళ్లిపోతాయి. జూలో వీటి సంరక్షణకు సిబ్బంది శ్రమిస్తున్నారు.జూపార్కులో సింహాలు 14, తెల్ల పులులు 10, బెంగాల్ టైగర్స్ 6, చిరుతలు 5, జాగ్వర్స్ 2, ఏనుగులు 5 ఉన్నాయి. నిరంతరం నీటితో వాటి ఆవాసాలను తడుపుతున్నారు.పులులు, చిరుతలు, జాగ్వర్‌లుండే ఎన్‌క్లోజర్ల మీద పచ్చ తివాచీలు కప్పి వేడిని తగ్గిస్తున్నారు. పులులున్న నైట్ హౌస్ లోపల వట్టివేర్ల చాపలు వేలాడదీసి, కూలర్లను ఏర్పాటు చేశారు. పక్షుల ఎన్‌క్లోజర్ల మీద నీటిని పిచికారీ చేస్తున్నారు. వీటి చుట్టూ పచ్చతెరలు కట్టి తడుపుతున్నారు. ఇక జింకలు, నీటి ఏనుగు, తాబేళ్లు, బాతులు, కొంగలు, అడవి పందులు, అడవి దున్నలు, హైనాలు, రేసుకుక్కలుండే తావుల్లో నీటి గుంతలు ఏర్పాటు చేశారు. కళ్యాణిడ్యాం నీటితో పాటూ 10బోర్లు నిరంతరం నీటిని అందిస్తున్నాయి. మొత్తానికి వనాలకు దూరమైన ఈ జీవుల ప్రాణాలను కాపాడడానికి వేసవిలో జూపార్క్ సిబ్బంది ఒక యుద్ధమే చేస్తారు. - మంగళం

మహిళలకు మేలు టీడీపీతోనే సాధ్యం



మహిళా శ్రామికశక్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

రాష్ట్రంలో మహిళలకు జరిగిన ఏ మేలైనా టీడీపీ ప్రభుత్వంలోనే జరిగిందని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిఅన్నారు.నిజం గెలవాలి కార్యక్రమ పర్యటనలో భాగంగా శనివారం ఉదయం చిల్లకూరులో శ్రామిక మహిళలతో ఆమె ముఖాముఖి మాట్లాడారు.అరాచకపాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆమెకు పలువురు మహిళలు తమ కష్టాలను చెప్పుకోవడంతో పాటు డిమాండ్లనూ విన్పించారు.

- గూడూరు/చిల్లకూరు

డబ్బులిస్తున్నా ఖర్చులు పెంచేశారు



టీడీపీ పాలనలో ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉండేది. వైసీపీ పాలనలో డబ్బులు ఇస్తున్నామని చెబుతున్నారు కానీ అన్ని ధరలూ పెంచేశారు. రొయ్యల పరిశ్రమలో రోజుకు రూ. 250 మాత్రమే ఇస్తున్నారు. జీతం పెంచమంటే కరెంటు బిల్లులు పెరిగాయి, కుదరదంటున్నారు. టీడీపీ హయాంలో ఇంటర్ వరకు నా కూతురు రూపాయి ఖర్చు లేకుండా చదివింది. వైసీపీ ప్రభుత్వం రాగానే నర్సింగ్ చదివేందుకు ఖర్చుపెట్టుకోవాల్సి వచ్చింది.చేతికందిన ఆ కూతురు కూడా అనారోగ్యంతో చనిపోవడంతో ఆదుకునేవారే కరువయ్యారు.

- రమాదేవి, ఓడూరు, చిల్లకూరు మండలం

బీమా పథకం లేక ఇబ్బందులు



నా భర్త నాలుగేళ్ల క్రితం వున్నట్టుండి ప్రమాదంలో చనిపోయారు. గతంలో చంద్రన్న బీమా పథకం ద్వారా ఆర్థికసాయం చేసి ఆదుకునేవారు.ఆ పథకాన్నే ఎత్తేసిన వైసీపీ ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదు.టీడీపీ అధికారంలోకి వస్తేనే మాలాంటి వారికి న్యాయం జరుగుతుంది.

- షాబీరా, మాళవ్యానగర్, గూడూరు

హెల్త్ గుర్తింపుకార్డులు అందజేయాలి



సిలికా మైనింగ్‌లో ఇసుక పనులతో జీవిస్తున్నాం. టీడీపీ పాలనలో మైనింగ్ పనులు పుష్కలంగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మైనింగ్ అంతా చెన్నై వారికివ్వడంతో యంత్రాల ద్వారా పనులు చేయడంతో పనులు తగ్గిపోయాయి. ఇసుక కడుపులోకి చేరడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.టీడీపీ ప్రభుత్వ హయాంలో హెల్త్‌కార్డుల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలందేవి. ప్రస్తుతం మైనింగ్‌కు వెళ్లే రోడ్లు కూడా సరిగా లేకపోవడంతో ప్రాణాలకు తెగించి ప్రయాణాలు చేయాల్సివస్తోంది.

- రాజ్యలక్ష్మి, కలవకొండ, చిల్లకూరు మండలం

ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలి



మూడు సంవత్సరాల క్రితం నా భర్త చనిపోయారు. ముగ్గురు ఆడపిల్లలను పెంచేందుకు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా.ఆ పనులు కూడా 100 రోజులు మాత్రమే కల్పిస్తున్నారు. 200 రోజులకు పనులను పెంచి మా జీవనోపాధిని మెరుగుపరచాలి.

- మణెమ్మ, తిప్పగుంటపాళెం, చిల్లకూరు మండలం

కలలకు రెక్కలు బాగుంది



మా నాన్న చనిపోవడంతో చదువు భారంగా మారింది. ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నా. పై చదువులకు వెళ్లాలనుకుంటున్న సమయంలో టీడీపీ కలలకు రెక్కలు కార్యక్రమాన్ని ప్రకటించడం ఆనందాన్నిచ్చింది. ఈ కార్యక్రమాన్ని అందరికీ అమలుపరిస్తే బాగుంటుంది.

-శ్రావణి, చెన్నూరు, గూడూరు మండలం

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

వాకాడు, మార్చి 23: వాకాడు మండలం తిరుమూరు గ్రామంలో మరణించిన టీడీపీ కార్యకర్త పిడుగు వెంకటస్వామి కుటుంబాన్ని నారా భువనేశ్వరి శనివారం పరామర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు కావడాన్ని జీర్ణించుకోలేక గతేడాది సెప్టెంబరు 14న వెంకటస్వామి (55) తీవ్ర ఆవేదనతో గుండెపోటుకు గురై మృతి చెందారు. వెంకటస్వామి ఇంటికి వెళ్లిన భువనేశ్వరి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తమ అభిమాన నేత చంద్రబాబు సతీమణి తమ ఇంట కాలుపెట్టడంతో భావోద్వేగానికి లోనైన కుటుంబీకులు భోరుమని విలపించారు. వారిని ఓదార్చిన భువనేశ్వరి ఆ కుటుంబానికి అండగా వుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో మాట్లాడారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, టీడీపీ అండగా వుంటుందని ధైర్యం చెప్పారు. ఐదేళ్ళుగా పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇపుడు అవన్నీ తీరే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా రానున్న ఎన్నికలు చాలా కీలకమైనవన్నారు. ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలనను అంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం,కొండేపాటి గంగాప్రసాద్, పాశం సంధ్యారాణి, తానంకి నానాజి, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామి కుటుంబసభ్యులకు పరామర్శ



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

ఇసుక అక్రమ రవాణాను పట్టించుకోరా?

- రిలే దీక్షకు దిగిన మూడు గ్రామాల రైతులు

ఏర్పేడు, మార్చి 23: ఏర్పేడు మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్న కలెక్టర్, ఎస్పీ కూడా పట్టించుకోవడం లేదని గోవిందవరం, మునగలపాళెం, వికృతమాల రైతులు శనివారం రిలే నిరాహార దీక్షకు దిగారు. వారు మాట్లాడుతూ.. తమ గ్రామాల సరిహద్దులో ఉన్న స్వర్ణముఖి నది ప్రాంతం నుంచి ఇసుకను రాత్రి వేళల్లో ఒడ్డుకు చేర్చి, పగటి పూట టిప్పర్లతో చెన్నై ప్రాంతానికి తరలిస్తున్నారని చెప్పారు. రోజుకు 30 నుంచి 50 టిప్పర్ల ఇసుక చెన్నైకి తరలిపోతోందన్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. 25రోజుల కిందట కలెక్టర్ లక్ష్మీశకు, పూర్వపు ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారు కూడా పట్టించుకోక పోవడంతో గోవిందవరం, మునగలపాళెం గ్రామాల వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున టెంటు వేసుకుని శాంతియుతంగా రిలే దీక్షకు దిగామని చెప్పుకొచ్చారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టే వరకు దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు పేరం చిరంజీవులునాయుడు మాట్లాడుతూ.. స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుకను తోడేయడం వల్ల సమీపంలో ఉన్న రైతుల బోర్లు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇలాగే తవ్వుతూ పోతే భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు.



స్వర్ణముఖి నది ఒడ్డున రైతుల రిలే దీక్ష

విధుల నుంచి విద్యుత్ ఈఈ తొలగింపు

తిరుపతి సెంట్రల్, మార్చి 23: ఎస్పీడీసీఎల్ మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్‌ను శనివారం విధుల నుంచి తొలగించారు. 2014లో ఆయన విజయవాడ సర్కిల్లో విధులు నిర్వహిస్తుండగా ఏసీబీ దాడులు నిర్వహించింది. అక్రమార్జనకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసింది. ఆ కేసులో ఇటీవల తుదితీర్పు వెలువరించారు.దీంతో ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 33 ఏళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సబ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ గతేడాది పదోన్నతిపై ఈఈగా మదనపల్లె డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ విచారణ అనంతరం విధుల నుంచి తొలగించారు.

కన్నులపండువగా తెప్పోత్సవం

తిరుమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి తెప్పోత్సవాల్లో శనివారం రాత్రి తెప్పపై శ్రీవారి పుష్కరిణిలో విహరించిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని దర్శించుకుని భక్తులు తన్మయులయ్యారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు.విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఉత్సవమూర్తులు ఆశీనులై పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు. చివరిరోజైన ఆదివారం శ్రీవారు ఏడుచుట్లు తెప్పపై విహరించనున్నారు.



ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

సూళ్లూరుపేట, మార్చి 23: ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్డీవో) ఆర్.చంద్రముని అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా అనుసరించాలని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ అధికారులకు పర్యటిస్తున్నారని తెలిపారు. అందరూ సమన్వయంతో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భద్రత పరంగా ఎటువంటి రాజీ ఉండదని, ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న సంధ్యారాణి, తెలుగు మహిళలు

గూడూరు, మార్చి 23: పట్టణంలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి తాగునీరు అందించే పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు కాలయాపన చేయడం మంచిపద్ధతి కాదన్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, గుండాల లీలావతి, తాళ్ల సుబ్బమ్మ, భారతి, శ్రీదేవి, శ్యామల, సుప్రజ, సుధా, లక్ష్మి, శైలజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయొద్దు



మతపెద్దలతో మాట్లాడుతున్న తహసీల్దారు నరసింహారావు

వాకాడు, మార్చి 23: ఎన్నికల సభలు, సమావేశాల నిర్వహణకు ఆలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని తహసీల్దారు నరసింహారావు చెప్పారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతి తీసుకునేందుకు ఈ-సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రచారం చేసే వాహనాలకు కూడా అనుమతి పత్రాలు పొందాలని అన్నారు. సోషల్ మీడియాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీనాథ్ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సృజన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్

కోట, మార్చి 23: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సృజన-2కే24 జాతీయ సదస్సును డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు రాష్ట్రాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరై రసాయన, భౌతిక, గణిత, ఆంగ్ల విభాగాల్లో పరిశోధన పత్రాలు సమర్పించారు. వాటిల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి షీల్డ్‌లు, మెమొంటోలు అందజేశారు.

తిరుమలలో రేపు పౌర్ణమి గరుడసేవ

తిరుమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం పౌర్ణమి గరుడ సేవ నిర్వహించనున్నారు. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా గరుడవాహన సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామి గరుడునిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

28న చేపల చెరువుల వేలం

వెంకటగిరి, మార్చి 23: మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కు కోసం ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ రషీద్ తెలిపారు. అమ్మవారిపేట, చెవిరెడ్డిపల్లి, పెరియవరం, మరాటపల్లి, మనులాలపేట, కుమ్మరిగుంట, ధర్మాపురం, పొలిశెట్టిగుంట చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కు వేలం శుక్రవారం నిర్వహించాల్సి వుండగా ఎవరు హాజరు కాకపోవడంతో ఈనెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ధరావత్తు రూ.5000 చెల్లించాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

వెంకటగిరి టౌన్, మార్చి 23: స్థానిక బంగారుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి హరి, క్షయ, కుష్టు, ఎయిడ్స్ నియంత్ర అధికారిణి అరుణ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, ఏఎన్‌ఎంలు

విజన్ ఉన్న నాయకుడే హీరో

చంద్రబాబు దార్శనికతను తలచుకుంటున్న ప్రజలు ● హీరో మోటార్స్‌కు ఆరు వసంతాలు పూర్తి

సత్యవేడు, మార్చి 23: నాయకుడికి విజన్ ఉండాలనేందుకు సాక్ష్యం సత్యవేడు మండలం మాదనపాళెంలో నడుస్తున్న హీరో పరిశ్రమ. చంద్రబాబు దార్శనికతకు ప్రతిరూపంగా ఆరేళ్ల కిందట ఏర్పడ్డ హీరో మోటార్స్ పరిశ్రమ ప్రస్తుతం 5వేల మందికి ఉపాధి చూపుతోంది. నవ్యాంధ్ర ఏర్పడిన నూరు రోజుల్లోనే 'హీరో పరిశ్రమ'ను పట్టుబట్టి రాష్ట్రానికి తీసుకొచ్చారు చంద్రబాబు. ఆ తర్వాత కియా, అపోలో లాంటి ఎన్నో భారీ పరిశ్రమలు రాష్ట్రానికి క్యూకట్టాయి. అయితే ఇదంతా అలవోకగా ఏమీ జరగలేదని పాత రోజులను ఈ ప్రాంత ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. జగన్ పాలనలో జిల్లా నుంచి పరిశ్రమలు పరారైన తీరును తలచుకుంటున్నారు. చంద్రబాబుతో జగన్‌ను పోల్చుకుని ఒక్క ఛాన్స్ ఇచ్చి మోసపోయామని నిట్టూరుస్తున్నారు.

2014 సెప్టెంబర్ 15న అప్పటి టీడీపీ ప్రభుత్వం మాదనపాళెంలో 600 ఎకరాల భూమిని హీరో మోటార్స్ పరిశ్రమకు కేటాయించింది. 2018 మార్చి 23న పరిశ్రమ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే భూములను ఇవ్వడానికి రైతులు నిరాకరించారు. వాస్తవానికి ఈ భూములు గ్రామంలోని సీతారామ స్వామి ఆలయానికి సంబంధించినవి. 2003లోనే ఈ భూములను ఏపీఐసీసీకి బదలాయించారు. శ్రీసిటీ ఏర్పాటుకు భూములు త్యాగం చేసిన రైతులు వీటిని చదును చేసుకుని సాగు చేసుకుంటున్నారు. తమకు తిండిపెట్టే భూములను వదులుకోబోమని తొలుత వారు పట్టుబట్టారు. అప్పటి కలెక్టర్ సిద్ధార్థజైన్, ప్రజా ప్రతినిధులు రైతులను ఒప్పించారు. రూ.20లక్షలతో గ్రామస్తులకు నూతన ఆలయాన్ని నిర్మించారు. ఇక హీరో పరిశ్రమ పనులు ప్రారంభం అవుతాయనుకున్న సమయంలో ఈ భూములను గతంలో ప్రభుత్వం తమకిచ్చిందంటూ చెన్నైకి చెందిన ఐశ్వర్య సంస్థ కోర్టుకెక్కింది. దాదాపు నాలుగేళ్లు ఈ వివాదం కోర్టులో నలిగింది. ఓ దశలో పరిశ్రమను ఇతర రాష్ట్రానికి తరలించాలని హీరో సీఎండీ పవన్ ముంజాల్ నిర్ణయానికొచ్చేశారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. స్వయంగా పవన్‌ముంజాల్ ఇంటికివెళ్లి వారికి ప్రభుత్వం తరఫున భరోసానిచ్చారు. నిర్ణయం మార్చుకుని ఏపీకి వచ్చేలా ఒప్పించారు. ఫలితంగా రూ.1600 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో నిర్మితమయిన హీరో ప్లాంట్ 2020లో పూర్తయి ఉత్పత్తిని ప్రారంభించింది. ఏటా 1.8మిలియన్ యూనిట్ల మోటార్ సైకిళ్లు, స్కూటర్ల తయారీ లక్ష్యంగా కార్యకలాపాలు జరుగుతున్నాయి.



హీరో పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న చంద్రబాబు

టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపిన 'నిజం గెలవాలి'

గూడూరు అర్బన్/వాకాడు, మార్చి 23: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన గూడూరు నియోజకవర్గంలో పర్యటన విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. చిల్లకూరులోని ఏ-5 హోటల్‌లో భువనేశ్వరి నిర్వహించిన మాటామంతి కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొనడం శ్రేణుల్లో జోష్ నింపింది. అలాగే వాకాడు మండలంలోని తిరుమూరు పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరిని చూసేందుకు గూడూరు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వారినుద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ మనం, మన కుటుంబం, మనమంతా ఒక్కటే... టీడీపీని గెలిపించేందుకు మనమందరం సిద్ధమా... సంసిద్ధమా... సై... అంటూ ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ మహిళల సమస్యలను తీర్చగలిగేది కేవలం టీడీపీ ప్రభుత్వమే అన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ సమయంలో మనోవేదనకు గురై చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను నేరుగా కలిసి వారిని ఓదార్చాలని భువనేశ్వరి సంకల్పం తీసుకున్నారన్నారు. వైసీపీ పాలనలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికలలో మహిళలందరూ చంద్రబాబుకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పాటుపడింది చంద్రబాబునాయుడేనని అన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు పరిచారని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించినందుకే చంద్రబాబుపై కక్షతో అక్రమంగా జైలుకు పంపారని అన్నారు. సొంత బాబాయిని హత్య చేసిన వారి పాలనలో ధైర్యం చేసి బయటకు వచ్చిన నారా భువనేశ్వరి టీడీపీ కుటుంబసభ్యులను ఓదార్చుతున్నారని అన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్ర ప్రజలను పీక్కుతింటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నెలవల సుబ్రహ్మణ్యం, దువ్వూరు మధుసూదనరెడ్డి, కుంచం దయాకర్, ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డి, దోసకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, తుమ్మల మోహన్‌నాయుడు, బత్తిన ప్రమీల, యల్లబోతు రాజగోపాల్‌రెడ్డి, దువ్వూరు భారతీరెడ్డి, షేక్ గౌసమోహిద్దీన్, గోపాల్, మోహన్‌రెడ్డి, చిరంజీవమ్మ, సునీతమ్మ, వేణునాయుడు, మామిడి గోవిందయ్య, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



నారా భువనేశ్వరిని సన్మానించి పూలమొక్క అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సంధ్యారాణి దంపతులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ - మాజీ మంత్రి నారాయణతో డాక్టర్ విజయశ్రీ

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు వర్క్‌షాప్

వెంకటగిరి/నాయుడుపేట, మార్చి 23: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు విజయవాడలోని ఏ-1 కన్వెన్షన్ హాల్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహాలు, ప్రచారం, టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండకట్టడం వంటి కీలక అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి



సూళ్లూరుపేటలో భగత్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 23: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, నాయకులు మోదుగుల వినోద్, నాగేంద్ర, సూర్య, సీహెచ్ బాలు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని కాంమ్రేడ్ సుందరరామిరెడ్డి కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద, ఐద్వా నాయకులు చంద్రకళ, విజయలక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు ప్రసాద్, సుధాకర్, రమేష్, సుబ్రహ్మణ్యం, వెంకయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి శేషయ్య స్మారక గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య, కృష్ణారెడ్డి, తిరుపాలు ప్రసాద్, ఓబయ్య, ఝాన్సీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కోట, మార్చి 23: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురానికి చెందిన జరీనా కొంతకాలంగా గర్భకోశ వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య దాతల సహకారంతో జరీనా వైద్య ఖర్చులకు రూ.10వేలు అందజేశారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

వెంకటగిరి, మార్చి 23: డక్కిలి మండలం వెంబులూరు పెదకోన అడవుల్లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఉన్న చిరువ్యాపారులకు స్వామి వివేకానంద యువ సైన్యం వ్యవస్థాపకుడు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొడుగులను పంపిణీ చేశారు.

రక్తదానం

గూడూరు అర్బన్, మార్చి 23: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సినీ హీరో రామ్‌చరణ్‌తేజ పుట్టినరోజు సందర్భంగా మెగా బ్రదర్స్ సేవాసమితి, అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తీగల చంద్రశేఖర్, చంద్రనీల్, ఓంకార్, భాస్కర్, మోహన్, సూర్య, వసంత్, సాయికిరణ్, శివ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి అనుమతులు లేవు

కోట, మార్చి 23: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశానికి ఎలాంటి అనుమతులు లేవని ఎంపీడీవో శంకరయ్య తెలిపారు. సమావేశం నిర్వహించిన నాయకులకు నోటీసులు జారీ చేయాలని ఈవోపీఆర్‌డీను ఆదేశించారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి

● నేతలకు కలెక్టర్ విజ్ఞప్తి
● ఎన్నికల యాప్‌పై అవగాహన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 23: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీశ రాజకీయ పక్షాలను కోరారు. శనివారం సాయంత్రం ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, కౌంటింగ్, ఎన్నికల యాప్ తదితరాలపై అవగాహన కల్పించారు. అయన మాట్లాడుతూ రీపోలింగ్‌కు తావులేకుండా చర్యలు చేపడతామన్నారు. ఓటరును ప్రలోభాలకు గురిచేయడం, భయపెట్టడం చేయకూడదని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య సంస్థల స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించమని తేల్చి చెప్పారు. ర్యాలీలు తప్పనిసరి అయితే సువిధ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమలు నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం వరకు చేసిన ఖర్చులన్నీ ఆయా పార్టీల ఖాతాల్లో నమోదు చేస్తామని, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి అభ్యర్థి వ్యక్తిగత ఖాతాల్లో నమోదవుతుందని చెప్పారు. ఆర్వో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ, ఇతర ర్యాలీలను నిర్వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు ఆదితిసింగ్, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

షార్ కాలనీలో చోరీ

24 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీఐ

సూళ్లూరుపేట, మార్చి 23: శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని ఫేస్-2లో కాలనీలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. శ్రీహరికోట పోలీసుల కథనం మేరకు... కాలనీలోని 327 నంబరు ఇంట్లో నివాసం ఉంటున్న నిర్మల షార్ ఆస్పత్రిలో హెడ్ నర్సుగా పనిచేస్తున్నారు. ఈనెల 18న కుటుంబ సభ్యులతో కలసి తన స్వస్థలమైన రాజమండ్రికి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తీసి ఉంది. లోపల ఉన్న వస్తువులు చిందరవందరంగా ఉండడంతో పాటు బీరువా తీసి ఉన్న 24 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీహరికోట ఎస్ఐ రఘునాథ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటి పరిశీలించి బాధితులను విచారించారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు కూడా వచ్చి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు వారాల క్రితం సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగులు ఉండే డీవోఎస్, డీఆర్‌డీఎల్ కాలనీల్లో మూడు ఇళ్లలో చోరీ జరిగింది. అత్యంత భద్రత ఉండే శ్రీహరికోట లోపల కాలనీల్లో చోరీ జరగడం నిఘా వైఫల్యమేనని తెలుస్తోంది.

విజయశ్రీని గెలిపించండి



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 23: మండలంలోని బంగారంపేట, మోదుగులపాలెం గ్రామాల్లో శనివారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో నెలకొన్న ఏ ఒక్క సమస్యనూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో డాక్టర్ నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, నాయకులు పేరం రమేష్ నాయుడు, మధుసూదన్ నాయుడు, కందమూడి శివకుమార్, హరినాయుడు, సిద్దులయ్యానాయుడు, రామకృష్ణా, మునీష్, నరేంద్రయాదవ్, వెంకటసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, గురవయ్య, చలపతి, పోలయ్య రమణయ్య, వాసు, పరుశురాం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, మార్చి 23: మండలంలోని పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలకు శనివారం స్థానిక మండల కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై తహసీల్దారు శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ఎలాంటి రాజకీయ పార్టీల సమావేశాలు, చర్చలు, ప్రసంగాలు, ప్రచారాలు జరపకూడదన్నారు. ఏ పార్టీకి చెందిన జెండాలనూ ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ఆర్డీవో అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఆర్ఐ రమ్య తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, మార్చి 23: సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆమ్‌నెక్స్ అకాడమీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేష్ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు అయ్యప్ప సెల్వం, హరీష్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన 10 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న బ్రహ్మయ్య